జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | బుధవారం 1 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక :167 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: కుసుమహారా జయంతి సూర్యోదయం: 5:30 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 7:44 । చంద్రాస్తమయం: 6:21 తిథి: బహుళ పాడ్యమి ఉ. 6:08 వరకు, తదుపరి విదియ నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 6:15 వరకు, తదుపరి ఉత్తరాషాఢ యోగం: ఇంద్రం సా. 4:06 వరకు, తదుపరి వైధృతి కరణం: కౌలవ ఉ. 6:08 వరకు, తదుపరి తైతుల రా. 6:55 వరకు, తదుపరి గరజి

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528




## అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి

- డిగ్రీలు కాదు... ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేదే నిజమైన విద్య
- విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో పాల్గొన్న లోకేశ్
- అన్ని వర్గాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని వ్యాఖ్య
- విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతామని స్పష్టం
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**అమరావతి**

ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, కేవలం డిగ్రీలు సంపాదించడం విద్యకు పరమార్థం కాదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి, దేశంలోని ప్రతి మూలకు చేరినప్పుడే వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. - మిగతా3లో


## ఏపీలో కనెక్టివిటీ కష్టాలకు చెక్

- సర్వీస్ ప్రొవైడర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఏపీలో సమాచార నెట్‌వర్క్‌పై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- మారుమూల ప్రాంతాల్లోనూ కనెక్టివిటీకి చర్యలు చేపట్టాలని ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2310 సెల్ టవర్ల ఏర్పాటుకు ప్రణాళిక
- మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ అక్షరాస్యత పెంచాలని సూచన
- కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా పూర్తి మొబైల్ కవరేజీకి నిర్ణయం



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో సమాచార, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టం చేసి, మారుమూల గ్రామాలకు సైతం కనెక్టివిటీ అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సమాచార నెట్‌వర్క్ విషయంలో ఏపీని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ దిశగా రాష్ట్రంలోని కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ఆయన ఉన్నతాధికారులు, వివిధ సర్వీస్ ప్రొవైడర్లతో అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మొబైల్ కవరేజి విషయంలో సర్వీస్ ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భౌగోళికంగా కవరేజి లేని - మిగతా3లో



## హర్మ్యూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం


- పశ్చిమాసియా తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ప్రధాని మోదీ చర్చ
- హర్మ్యూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌తో పాటు ప్రపంచానికి కీలకమని స్పష్టం
- హర్మ్యూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని!
- అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి




## గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర

- జులై 1 నుంచే వీబీజీ రామ్‌జీ చట్టం అమలు
- రూ.కోట్లల్లో బకాయిలు చెల్లించలేదని కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- MGNREGA స్థానంలో వీబీజీ రామ్‌జీ చట్టం జులై 1 నుంచే అమల్లోకి
- రాష్ట్రాలపై భారం పెరుగుతుందని, బకాయిలు చెల్లించలేదని కాంగ్రెస్ ఆరోపణలు

## ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యంగా



- కేంద్ర కార్యదర్శులతో ప్రధాని మోదీ కీలక సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆత్మనిర్భర్ భారత్‌పై ప్రధాని నరేంద్ర మోదీ సమీక్ష
- ప్రభుత్వ పథకాల ప్రభావం ప్రజల జీవితాల్లో స్పష్టంగా కనిపించాలని ఆదేశం
- మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలి
- శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుంది



## ఇక డాలర్‌తో పనిలేదు... భారత్-జపాన్ కీలక ఒప్పందం!

- డాలర్‌ను పక్కనపెట్టి యెన్-రూపాయి ప్రత్యక్ష లావాదేవీలకు భారత్-జపాన్ సన్నాహాలు
- ప్రధాని మోదీతో జపాన్ ప్రధాని సనాయె తకైచి భేటీలో కీలక చర్చ
- తగ్గనున్న ఫారెక్స్, లావాదేవీల ఖర్చులు.. వేగవంతం కానున్న వాణిజ్యం
- భారత్‌లో జపాన్ కంపెనీలకు ప్రోత్సాహం.. పెరగనున్న ప్రైవేట్ పెట్టుబడులు
- త్వరలో ఆర్‌బీఐ, జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య అవగాహన ఒప్పందం

### విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు వ్యవహార జ్ఞానం

## పెంపొందించుకోవాలి



- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- విశాఖలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం
- స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ద్రౌపదీ ముర్ము
- 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు ప్రదాన కార్యక్రమం

**అమరావతి**

విశాఖలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటించారు. తొలుత విశాఖలోని ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు లోకేశ్, అనిత, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన నోవాటెల్‌కు రాష్ట్రపతి ముర్ము చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 373 మంది డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు - మిగతా3లో



## రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం

- దేశానికి బలమైన ఆర్థిక వ్యవస్థ, సాంకేతికత, జాతీయ భద్రతే మూలస్తంభాలు
- దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయి
- వడోదరలో వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ మంత్రి ప్రసంగం
- 2003లో ప్రారంభమైన వైబ్రంట్ గుజరాత్ ఇప్పుడు వికసిత్ భారత్ లక్ష్యానికి జాతీయ ఉద్యమంగా మారిందన్న రాజ్‌నాథ్

## మామిడి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నాం

- మామిడి దిగుబడి పెరిగినందునే కొనుగోళ్లపై ఒత్తిడి పెరిగింది: మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- రైతుల ప్రయోజనాలే తమకు పరమావధి అన్న మంత్రి



**అమరావతి**

చిత్తూరు జిల్లా మామిడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన... గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చొప్పున అదనంగా చెల్లించి ఆదుకుందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే రీతిన కేజీకి రూ.4 ముందస్తుగా అందిస్తూ మామిడి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈసారి పంట దిగుబడి ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా రావడం వల్లే కొనుగోళ్లపై తాత్కాలికంగా కొంత ఒత్తిడి పెరిగిందని, అంతకుమించి మరేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది కూడా మామిడి రైతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.190 కోట్లు వెచ్చించి అండగా నిలిచిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఒకవేళ కొనుగోళ్ల - మిగతా3లో

# హర్మ్యూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రాంతీయ శాంతి, హర్మ్యూజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛ వంటి కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ఇరాన్ అధ్యక్షుడు ప్రధానికి వివరించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. అలాగే భవిష్యత్ కార్యాచరణపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపింది. ఫోన్ సంభాషణలో ప్రధాని మోదీ, చర్చల ద్వారా సాధించిన పురోగతిని స్వాగతించారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. ప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం నెలకొనేలా అన్ని వర్గాలు కృషి కొనసాగించాలని సూచించారు. అంతేకాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్య రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భారత్‌కు ఇంధన అవసరాల్లో గల్ఫ్ దేశాల ప్రాధాన్యం దృష్ట్యా హర్మ్యూజ్ జలసంధి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. ప్రపంచంలో సముద్ర మార్గంలో తరలించే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడటంతో పాటు భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే హర్మ్యూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు పీఎంఓ పేర్కొంది.

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ కూడా పశ్చిమాసియాలోని తాజా పరిణామాలను ప్రధానికి వివరించారు. ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, శాంతి ప్రయత్నాలు, తదుపరి చర్యల గురించి ఆయన వివరణ ఇచ్చినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్?లో స్పందించారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. చర్చల్లో సాధించిన పురోగతిని స్వాగతించానని,




కొనసాగుతున్న ప్రయత్నాలు ప్రాంతంలో శాశ్వత శాంతికి దారి తీస్తాయని ఆశాభావం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే హర్మ్యూజ్?లో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌కే కాకుండా ప్రపంచానికే అత్యంత ముఖ్యమని మరోసారి పునరుద్ఘాటించినట్లు వెల్లడించారు.


**14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం**

ఇటీవలి కాలంలో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ మధ్య జరిగిన వరుస చర్చల్లో ఇది మరో ముఖ్యమైన సంభాషణగా భావిస్తున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, సముద్ర వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై భారత్ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజుల క్రితం అమెరికా-ఇరాన్ మధ్య 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరినట్లు సమాచారం వెలువడింది. ఇందులో హోర్ముజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరవడం, ఇరాన్‌పై అమలులో ఉన్న కొన్ని ఆర్థిక పరిమితులను సడలించడం వంటి అంశాలు ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడి మధ్య తాజా చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అయితే అమెరికాతో సమీప భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ స్థాయి సమావేశాలు నిర్వహించే ప్రణాళిక ప్రస్తుతం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి మీడియాతో మాట్లాడుతూ, అమెరికా ప్రతినిధులతో రాబోయే రోజుల్లో ఏ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించే యోచన లేదన్నారు. దోహాలో జరగబోయే సమావేశాలు అమెరికాతో రాజకీయ చర్చలు కాదని, ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందంలోని అంశాల అమలుకు సంబంధించిన సాంకేతిక స్థాయి చర్చలేనని వివరించారు. ప్రత్యేకంగా ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన ఆర్థిక ఆస్తుల విడుదల, ఒప్పందంలోని ఇతర నిబంధనల అమలుపై ఖతార్ ప్రతినిధులతో చర్చలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. మరోవైపు, పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు భారత్ ఎప్పటినుంచో సమతుల్య వైఖరినే అవలంబిస్తోంది. వివాదాలను యుద్ధం ద్వారా కాకుండా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అదే సమయంలో భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకేతాన్ని కూడా ఇస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో జరిపిన తాజా టెలిఫోన్ సంభాషణ పశ్చిమాసియా పరిణామాలపై భారత వైఖరిని మరోసారి స్పష్టంగా తెలియజేసింది.

# ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యంగా

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, ఆయా శాఖల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సేవా తీర్థ్‌లో కీలక సమావేశం నిర్వహించారు. దేశంలో పరిపాలనా సంస్కరణల్ని వేగవంతం చేయడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపర్చడం, ప్రజలకు ప్రభుత్వ సేవల్ని సులభతరం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అలాగే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్లడం, వేగంగా అమలు చేయడం కూడా ఈ 4 గంటల ఉన్నత స్థాయి సమావేశంలో చర్చకు వచ్చింది. సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మొదటిది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం డీ- రెగ్యులేషన్ (అనవసర నిబంధనల సరళీకరణ), ఇతర పరిపాలనా సంస్కరణలు' అంటే అంటే వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం సహా పౌరుల రోజువారీ జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చడం. ఇక రెండోది 'ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేయడం'. వివిధ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించడం. ఈ సందర్భంగా వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు తమ శాఖలు చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రధానికి వివరించారు. ప్రధాని విజన్‌ను కార్యచరణగా మార్చేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి రూపొందించిన భవిష్యత్తు వ్యూహాల్ని కూడా వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ- ప్రభుత్వ శాఖలు విడివిడిగా కాకుండా పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.



మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు ప్రధాని.

**ప్రభుత్వ పథకాల అమలు- ప్రజల జీవితాల్లో మార్పుపై దిశానిర్దేశం**

వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, డేటా ఆధారిత నిర్ణయాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం గతిశక్తి ప్లాట్‌ఫారంను మరింత విస్తృతంగా వినియోగించాలని ప్రధాని సూచించారు. ఈ వేదిక ద్వారా మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత సులభతరమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల విజయాన్ని కేవలం అవి అమలవుతున్నాయా లేదా అన్నదానితో కాకుండా వాటి వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందనే దానితోనే అంచనా వేయాలని ప్రధాని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ తదితరులు పాల్గొన్నారు. ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మొట్టమొదటి పూర్తి స్థాయి కార్యదర్శుల స్థాయి సమావేశంగా తెలుస్తోంది. 2026 రెండో అర్ధభాగానికి సంబంధించి ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం కూడా సమావేశం ఉద్దేశంగా తెలుస్తోంది.

**మోదీ విజన్ లక్ష్యాలకు అనుగుణంగా- దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి**

ఇక తాజా సమావేశంలో జరిగిన చర్చలు జూన్ 21న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించిన సంస్కరణల కార్యచరణకు కొనసాగింపుగా నిలిచాయి. అప్పుడు కూడా ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపర్చడంతో పాటుగా యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి (2047, ఆగస్ట్ 15) అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టాలన్న మోదీ దార్శనికతలో భాగంగా ప్రభుత్వం దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి సారిస్తున్న తరుణంలో ఈ మీటింగ్ జరిగింది. మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు మార్కెట్లలో అస్థిరత వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరును కనబరుస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇక డాలర్‌తో పనిలేదు...
## భారత్-జపాన్ కీలక ఒప్పందం!

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు (అశీఅ-తీవంఱఅవత్‌ం) భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×), జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్-జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

## గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఉద్దేశించిన వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం-వీబీజీ రామ్‌జీ యాక్ట్- 2025 ఈ జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రాబోతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్నటువంటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలోనే ఈ కొత్త వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకారం కొత్త చట్టం కింద అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 100 రోజులకు బదులుగా 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధ హామీ లభిస్తుంది. ఈ పథకం అమలుకు అవసరమైన పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక ఏర్పాట్లు పూర్తయ్యాయని కేంద్రం తెలిపింది. అయితే ఈ పథకం మార్పుపై కాంగ్రెస్ పార్టీతో సహా గ్రామీణ ఉపాధి హక్కుల కార్యకర్తలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం అమలు కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 95,692.31 కోట్ల మేర తాత్కాలిక నిధులు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కొత్త వ్యవస్థలో అంతా సజావుగా జరిగి, కార్మికులకు వేతనాలు కూడా ఆలస్యం కాకుండా అందుతాయని పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ- 'పనిచేయాలనుకునే ఒక్క అర్హుడైన గ్రామీణ కార్మికుడు కూడా ఉపాధి లేకుండా ఉండకూడదనేదే ప్రభుత్వ లక్ష్యం' అని చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి ఈ చట్టం అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

**గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర**

ప్రస్తుతం ఈ- కేవైసీ ధ్రువీకరణ పొందిన జాబ్ కార్డులు, కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు చెల్లుబాటులోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే గ్రామ పంచాయతీలే పథకం అమలులో ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపింది. నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతులు, మహిళా సాధికారత వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటికే బడ్జెట్ కేటాయించగా, 24 రాష్ట్రాలు తమ రాష్ట్ర స్థాయి ఎదీ- + =ూవీ + పథకాల నోటిఫికేషన్లు జారీ చేశాయి.

**రాష్ట్రాలపైనే భారం మోపుతున్న కేంద్రం: కాంగ్రెస్ విమర్శలు**

కొత్త వీబీ జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శలు చేసింది. కొత్త పథకాన్ని తీసుకొచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. లోక్‌సభలో ఇచ్చిన సమాచారం ప్రకారం 2026 మార్చి నాటికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 17144.13 కోట్ల ఎంజీనరేగా బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీంట్లో రూ. 7846.25 కోట్లు కార్మికుల వేతన బకాయిలే ఉన్నాయని తెలిపారు. కర్ణాటక, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు కోట్లల్లో బకాయిలు విడుదల కాలేదని ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో వీ+చీ=జు+ూ లో కార్మికుల వేతన వ్యయాల్ని కేంద్రమే పూర్తిగా భరించేదని, ఇప్పుడు కొత్త పథకంలో మొత్తం వ్యయంలో 40 శాతం భారాన్ని రాష్ట్రాలపైనే మోపుతున్నారని విమర్శలు గుప్పించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల బ్లాక్ అవుట్ నిబంధన వల్ల గ్రామీణ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, దీనిని పునఃసమీక్షించాలని పలు రాష్ట్రాలు కోరుతున్నట్లు ఖర్గే తెలిపారు. ఇంకా రోజువారీ కూలీని రూ. 400 కు పెంచాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండిస్తోంది. వీబీ జీ రామ్ జీ యాక్ట్ గ్రామీణ జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తుందని, ఉపాధి అవకాశాల్ని పెంచడంతో పాటుగా గ్రామీణ ఆస్తుల సృష్టికి దోహదపడుతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త చట్టం జాతీయ స్థాయిలో ప్రారంభ కార్యక్రమం జులై 2న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లి గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డుల పంపిణీతో పాటుగా పథకంపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

# రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం

బలమైన ఆర్థిక వ్యవస్థ, అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం, పటిష్ఠమైన జాతీయ భద్రత ఈ మూడూ ఒక గొప్ప దేశానికి మూలస్తంభాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక గత రెండు దశాబ్దాల్లో గుజరాత్ అభివృద్ధికే కాకుండా దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను కూడా తాను సందర్శించినట్లు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), గిరిజన ఉత్పత్తులు, భారీ పరిశ్రమలు, రక్షణ రంగానికి సంబంధించిన అనేక విభాగాలు ఇందులో పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయమని చెప్పారు. దేశంలో ప్రైవేటు పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**మోదీ కూడా ఈ నేల నుంచే!**

గుజరాత్ దేశానికి ఎన్నో గొప్ప నాయకులను అందించిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి మహానుభావులతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ నేల నుంచే ఎదిగారని చెప్పారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ మరింత పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ వేదికల్లో భారత్ మాట్లాడితే ప్రపంచ దేశాలు ఆసక్తిగా వినే పరిస్థితి ఏర్పడిందని, దీనికి నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. వైబ్రంట్ గుజరాత్ కార్యక్రమం 2003లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ప్రారంభించారని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. అప్పట్లో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రారంభమైన ఈ వేదిక, ఇప్పుడు దేశ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. గత 20 ఏళ్లలో గుజరాత్‌లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం దేశ ఆర్థికాభివృద్ధికి గుజరాత్ గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. తాను రక్షణ మంత్రిగా వైబ్రంట్ గుజరాత్ సదస్సుకు రావడంపై కొందరికి సందేహాలు రావొచ్చని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే



ఆర్థికాభివృద్ధి, జాతీయ భద్రత రెండూ విడదీయరాని అంశాలని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఉంటేనే దేశ భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని తెలిపారు. అలాగే రక్షణ రంగం అభివృద్ధి అంటే కేవలం ఆయుధాల తయారీ మాత్రమే కాదని, దాని ద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, సాంకేతిక రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వీటి ద్వారా తయారీ రంగం విస్తరించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్న నేపథ్యంలో భారత పరిశ్రమలు కూడా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

**ఒకదానితో ఒకటి అనుసంధానమై!**

గొప్ప దేశాలు మూడు ప్రధాన ఆధారాలపై నిలబడతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మొదటిది బలమైన ఆర్థిక వ్యవస్థ, రెండోది సాంకేతిక సామర్థ్యం, మూడోది జాతీయ భద్రత అని వివరించారు. ఈ మూడు పరస్పరం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయని చెప్పారు. ఆర్థికంగా బలమైన దేశం సాంకేతికంగా కూడా ముందంజలో ఉంటుందని, అలాంటి దేశంలో భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో జాతీయ భద్రత బలంగా ఉన్నప్పుడు పరిశ్రమలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు వేగంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై భారత్ పోషించే పాత్ర దేశ స్వావలంబన, సాంకేతిక సామర్థ్యం, ప్రజల సమష్టి సంకల్పంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం అన్ని రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని, పరిశ్రమలు, స్టార్టప్‌లు, రక్షణ తయారీ, సాంకేతిక రంగాలు కలిసి పనిచేస్తే భారత్ ప్రపంచంలో మరింత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక కేవలం పెట్టుబడుల సదస్సుగా మాత్రమే కాకుండా దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికగా మారిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, యువ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్ణీత సమయంలోనే సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## విద్యుత్ వైర్లు కట్ చేస్తున్న గంజాయి బ్యాచ్

**గుంటూరు :** గుంటూరు నగరంలోని ముస్లిం కాలేజ్ ప్రాంతం.. 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో స్థానికుల నుండి వరుస పోన్లు వచ్చాయి. అర్ధరాత్రి సమయంలో పెదకాకాని పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో వరుసగా ఫోన్లు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిబ్బంది హుటాహుటిన ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చింది చూసి వెంటనే పరిష్కరించారు. ఇదే తరహాలో వారం రోజుల క్రితం రామిరెడ్డి తోట పరిధిలో కూడా అర్ధరాత్రి సమయంలో పవర్ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇలా వరుసగా జరగటంతో విద్యుత్ శాఖాధికారులు ఆలోచనలో పడ్డారు. అసలు ఏంజరిగి ఉంటుందా అని లైన్లు పరిశీలించారు.


## మామిడి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

ప్రక్రియలో ఎక్కడైనా జాప్యం జరిగితే మాత్రం సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన, ఆ పార్టీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్ల విషయంలో కావాలని అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే పరమావధి అని స్పష్టం చేసిన మంత్రి... కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం రైతుల సమస్యలను వాడుకోవాలని చూడొద్దంటూ వైసీపీ నేతలకు గట్టి కౌంటర్ ఇచ్చారు.

# ప్రజలతో మమేకమై ఉంటేనే గెలుస్తాం

**విజయవాడ :** సంక్షేమ పథకాలే కేవలం అధికారం తెచ్చిపెట్టవని తెలుగుదేశం పార్టీ గుర్తించినట్లుంది. సంక్షేమం అంటూ మళ్లీ ఎన్నికలకు వెళితే జనం మరోసారి అధికారాన్ని అప్పగించే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ విషయాన్ని నారా లోకేశ్ తో పాటు కూటమిలోని మిత్రపక్షమైన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం సంక్షేమంతోనే తిరిగి అధికారంలోకి రావాలని భావిస్తే అది సాధ్యం కాదని, ప్రజలతో మమేకమై ఉంటేనే గెలుస్తామని వారు పదే పదే నేతలకు చెబుతున్నారు. ప్రజలతో ఉన్న సంబంధాలే గెలిపిస్తాయని చెబుతుండటం కూడా ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. నిజానికి లోకేశ్, పవన్ కల్యాణ్ ఈ మాటలను బహిరంగంగా చెబుతున్నప్పటికీ చంద్రబాబు మనసులోనూ అదే ఉంటుంది. ఎందుకంటే గత వైసీపీ ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలను అమలుచేసి తిరిగి అధికారంలోకి రావాలన్న కలను జనం చెదరగొట్టేశారు. పదకొండు సీట్లకే పరిమితం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం కేవలం పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, మూడు గ్యాస్ సిలిండర్లు ఇలాంటి పథకాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని కూడా అంచనాకు వచ్చినట్లు కనపడుతుంది. అందుకే సూపర్ సిక్స్ లో మిగిలి పోయిన హామీలను అమలు చేసే అవకాశం లేదని కూటమి నేతల మాటలను బట్టి అర్థమవుతుంది. ప్రధానంగా యాభై ఏళ్లు దాటిన వారికి పింఛను, మహిళలకు నెలకు 1,500 రూపాయలు వంటి పథకాలు అమలుకు ఈ మూడేళ్లలో నోచుకునే అవకాశాలు కూడా లేవన్నది స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకంటే ఇప్పటికే సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే నెల తిరిగే సరికి అప్పులు తేవాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంతో ఇంతో సహకారం అందించడం వల్ల ఈ రెండేళ్లు ఆర్థికంగా కొంత ఇబ్బందులు లేకుండా పాలన సాగించారు. కానీ రానున్న కాలంలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది చెప్పలేని పరిస్థితి. అందుకే సంక్షేమ పథకాలకు మంగళం పాడాలన్న ఉద్దేశ్యంతోనే చంద్రబాబు ప్రభుత్వం ఆలోచన సాగుతున్నట్లుంది. అయితే ప్రస్తుతం కొనసాగిస్తున్న పథకాలు మాత్రం కంటిన్యూ చేసి,



మిగిలిన పథకాలు మాత్రం హోల్డ్ లోపెట్టే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**కుల ప్రస్తావన లేకుండా సాధ్యమేనా**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ లక్ష్యం ఆంధ్రప్రదేశ్ లో నెరవేరుతుందా? అన్నది ఇప్పుడు సందేహంగా మారింది. కులాల ప్రస్తావన చేయకుండానే రాజకీయాలు చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పడం ఆచరణలో సాధ్యమేనా? అన్న చర్చ జరుగుతుంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అంటే కులాలతో ముడిపడి ఉన్న రాజకీయం. గత కొన్ని దశాబ్దాలుగా కులాల మధ్యనే రాజకీయం నడుస్తుంది. ఇప్పుడు పవన్ కల్యాణ్ కుల జాడ్యాన్ని కూకటి వేళ్లతో పీకివేయాలని ప్రయత్నించడం సాహసోపేతమైన చర్యగానే చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో ఏ రాజకీయ పార్టీ అయినా కులం పునాదుల మీద నడవాల్సిందే. కొన్ని ఏళ్లుగా అన్ని పార్టీలూ అదే కోవలో నడుస్తున్నాయి.రాజకీయ చరిత్ర కుల ప్రస్తావన లేకుండానే... కానీ ఇటీవల పవన్ కల్యాణ్ తాను కులం ప్రస్తావన లేకుండానే రాజకీయాలు చేస్తానని చెప్పడం ఒకింత ఆశ్చర్యకరమే. కులాలు పేరు చెప్పి తాను ఓట్లు అడగనని కూడా పవన్ కల్యాణ్ అనడం వచ్చే ఎన్నికల ప్రచారం వరకూ ఆగాల్సిందే. ఎందుకంటే గత ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ కులం ప్రస్తావన తెస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ట్రోల్ చేస్తున్నారు. కానీ వచ్చే ఎన్నికల్లోనూ కాపు సామాజికవర్గం అండ పవన్ కల్యాణ్ కు అసవరం ఉంటుంది. అప్పుడు ఏం చేస్తారన్నది జనసైనికుల్లోనూ చర్చ మొదలయింది. అయితే పవన్ కల్యాణ్ కు సినిమాల పరంగా కులాలకు, మతాలకు అతీతంగా అభిమానులు ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.బలమైన సామాజికవర్గాన్ని... కానీ రాజకీయాలకు వచ్చే సరికి వేరుగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ లో 27 శాతం ఓటు బ్యాంకున్న కాపు సామాజికవర్గాన్ని తెలివైన ఏ రాజకీయ నాయకుడు దూరం చేసుకోరు. పవన్ కల్యాణ్ కూడా అదే విశ్వాసంతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్నికల సమయానికి తనను వదిలి వెళ్లరన్న ధీమాలో ఆయన ఉన్నారు. కేవలం కాపు సామాజికవర్గం ఓట్లతోనే ఎవరూ గెలవలేరన్న పవన్ కల్యాణ్ మాటల్లోనూ నిజం లేకపోలేదు. అందుకే ముందుగా మిగిలిన సామాజికవర్గ ఓటర్లను దగ్గరకు తీసుకోవడం ప్రథమ లక్ష్యంగా పవన్ కల్యాణ్ పెట్టుకున్నట్లు కనపడుతుంది. చివరకు కాపులు తనను వీడి పోరన్న నమ్మకమే పవన్ ను నోట ఆ మాట పలకిస్తుందంటున్నారు. మరి ఎన్నికల నాటికి పవన్ మాట తీరు ఎలా మారుతుందన్నది చూడాలి.

# వంశీ మోహన్, కొడాలి నానిలు.. ఔట్

**విజయవాడ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలామంది వివిధ కేసుల్లో అరెస్టు అయ్యారు. బెయిల్ పై బయటకు వచ్చి యాక్టివ్ రాజకీయాలు చేస్తున్నారు. అయితే వల్లభనేని వంశీ మోహన్ మాత్రం అటువంటి ప్రయత్నం కూడా చేయడం లేదు. అసలు గన్నవరంలో అడుగుపెట్టడం లేదు. సొంత వారి దగ్గరకు కూడా చేరడం లేదు. అదే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగించే విషయం. గన్నవరంలో వల్లభనేని వంశీ మోహన్ ను మార్చి కొత్త ఇన్చార్జిని తెస్తారని ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఓ కాంగ్రెస్ మహిళా నేత పేరు వినిపిస్తోంది. ఆమె అయితేనే అక్కడ రాజకీయాలను తట్టుకోగలరు అనేది పొలిటికల్గా వినిపిస్తున్న మాట. వల్లభనేని వంశీ మోహన్ పై జగన్మోహన్ రెడ్డి నమ్మకం కోల్పోయినట్లు ప్రచారం జరుగుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అందగాడుగా వల్లభనేని వంశీ మోహన్ కు పేరు ఉంది. ఎందుకంటే వల్లభనేని వంశీ మోహన్ అందాన్ని చూసి చంద్రబాబు తట్టుకోలేకపోయారని.. ఆయనపై విమర్శలు చేస్తున్నారని ఒకానొక సందర్భంలో జగన్మోహన్ రెడ్డి అభివర్ణించారు. అప్పటినుంచి వైసిపి అందగాడుగా వల్లభనేని వంశీ మోహన్ కు పేరు ఉంది. కానీ ఆ అందం జైలుకు వచ్చిన తర్వాత కనిపించలేదు సరి కదా.. అసలు పోల్చుకోలేకపోయారు కూడా. అంతలా కళావిహీనం అయ్యారు వల్లభనేని వంశీ మోహన్.2019లో రెండోసారి టిడిపి తరఫున గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. తర్వాత వైసీపీలోకి ఫిరాయించారు. రాజకీయాల్లో జంపింగులు సహజమే. కానీ అంతకుమించి అన్నట్టు వ్యవహరించారు వల్లభనేని. చంద్రబాబుపై వ్యక్తిగత కామెంట్లు చేయడంతో పాటు భువనేశ్వరి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సభ్య సమాజంలో చులకన అయ్యారు. తలెత్తుకో లేని విధంగా మారారు. అయితే ఇప్పుడు అదే వల్లభనేని వంశీ మోహన్ గన్నవరం లో యాక్టివ్ గా లేకపోయేసరికి? జగన్మోహన్ రెడ్డి మార్చేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆయన స్థానంలో కాంగ్రెస్ మహిళా నేత సుంకర పద్మశ్రీ పేరు



వినిపిస్తోంది. ఆమె సైతం బాధ్యతలు ఇస్తే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరి జగన్ మోహన్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

**నాని సంగతి అంతేనా**

యస్ జగన్మోహన్ రెడ్డి కొడాలి నానికి క్లాస్ పీకారా? పార్టీలో యాక్టివ్ విషయంలో సీరియస్ గా ఆదేశాలు జారీ చేశారా? ఇదే పరిస్థితి మరో మూడు నెలలు కొనసాగితే గుడివాడకు కొత్త ఇన్చార్జిను నియమించే అవకాశం ఉందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల జగన్ మోహన్ రెడ్డితో కొడాలి నాని భేటీ అయినట్లు తెలుస్తోంది. ప్రధానంగా గుడివాడ నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యకలాపాల గురించి చర్చించినట్లు సమాచారం. ఏమాత్రం పనితీరు బాగాలేదని.. ఇలా అయితే మార్చేస్తానంటూ జగన్మోహన్ రెడ్డి హెచ్చరించినట్లు సోషల్ మీడియాలో తెగ ప్రచారం నడుస్తోంది. అయితే జగన్ ఈ నిర్ణయానికి రావడం వెనుక చాలా రకాల పరిణామాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. పార్టీ ఓడిపోయి రెండు సంవత్సరాలు అవుతున్న కొడాలి నాని నియోజకవర్గానికి అందుబాటులోకి రాకపోవడాన్ని జగన్మోహన్ రెడ్డి తప్పు పడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఇటీవల కొడాలి నాని బిజెపిలో చేరుతారని ఒక ప్రచారం అయితే మాత్రం జోరుగా సాగింది. మహారాష్ట్రకు చెందిన బిజెపి ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఆలయాల సందర్శనకు వెళ్లారు. అయితే అంతకుముందు కొడాలి నానిని పిలిచి జగన్ ఒక సూచన చేసినట్లు తెలుస్తోంది. ఈసారికి గుడివాడని విడిచిపెట్టి విజయవాడ ఎంపీ కి పోటీ చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో కొడాలి నాని ఒక్కసారిగా రియాక్ట్ అయినట్లు సమాచారం. బిజెపి నేతలతో తిరగడం ద్వారా పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు సంకేతాలు ఇస్తే.. జగన్మోహన్ రెడ్డి తన లైన్లోకి వస్తారని కొడాలి నాని భావించినట్లు తెలుస్తోంది. మరోవైపు కొడాలి నాని తన తమ్ముడి కుమారుడ్ని వారసుడిగా ఏకపక్షంగా ప్రకటించడానికి కూడా జగన్మోహన్ రెడ్డి తప్పు పట్టినట్లు తెలుస్తోంది.గన్నవరంలో నెలల తరబడి వల్లభనేని వంశీ మోహన్ అందుబాటులోకి రాలేదు. దానికి కారణం ఆయన నాలుగు నెలల పాటు జైలు జీవితం అనుభవించాల్సి వచ్చింది. కనీసం గుర్తుపట్టలేని విధంగా తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు . తనపై కూడా అనేక రకాల కేసులు ఉండడంతో వల్లభనేని వంశీ పరిస్థితి తనకు ఎదురవుతుందని కొడాలి నాని కి తెలుసు. పైగా గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్ల ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో గుడివాడలో నెగ్గుకు రావడం అంత సులువు కాదు అని కొడాలి నాని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలోనే ఆయన నియోజకవర్గం మొఖం చూడడం లేదని సమాచారం. అందుకే జగన్మోహన్ రెడ్డి ఇటీవల పిలిపించుకొని పూర్తిగా మాట్లాడినట్లు.. మరో నెల రోజుల్లో యాక్టివ్ కాకుంటే తన నిర్ణయం తాను తీసుకుంటానని ముఖం మీద చెప్పినట్లు టాక్ నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## తాడో పేడో అంటున్న ధర్మాన సోదరులు

**శ్రీకాకుళం :** వైయస్ జగన్మోహన్ రెడ్డి తో తాడోపేడో తేల్చుకునేందుకు ధర్మాన సోదరులు సిద్ధమయ్యారన్న ప్రచారం శ్రీకాకుళం పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తోంది. దానికి ప్రధాన కారణం దువ్వాడ శ్రీనివాస్. వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్న శ్రీనివాస్ పై కొద్ది నెలల కిందట సస్పెన్షన్ వేటు పడిన సంగతి తెలిసిందే. ఆయన వ్యక్తిగత కుటుంబ వ్యవహార శైలితో పార్టీకి ఇబ్బందులు వస్తున్నాయని చెప్పి సస్పెన్షన్ వేటు వేశారు. అయితే దీని వెనుక ధర్మాన సోదరుల హస్తం ఉందని దువ్వాడ శ్రీనివాస్ ఆరోపిస్తూ వచ్చారు. ధర్మాన సోదరులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు కూడా చాలా సందర్భాల్లో. అయితే దువ్వాడ శ్రీనివాస్ పై కేవలం సస్పెన్షన్ వేటు కాదని.. పూర్తిగా పార్టీ నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని ధర్మాన సోదరులు పట్టుబడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. దానికి కారణం లేకపోలేదు. లేనిపోని వివాదాలతో పార్టీని డ్యామేజ్ చేస్తున్నారు అనేది ధర్మాన సోదరుల అభిప్రాయం.కేవలం దువ్వాడ శ్రీనివాస్ లో ఉన్న దూకుడు తనం చూసి జగన్మోహన్ రెడ్డి ఎంతగానో ప్రోత్సహించారు. కింజరాపు ఫ్యామిలీని నియంత్రించేందుకు వీలుగా దువ్వాడ శ్రీనివాస్ కు ప్రోత్సాహం అందించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన సరే ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ఒకానొక దశలో మంత్రి పదవి ఇస్తారని కూడా ప్రచారం జరిగింది. అయితే 2024లో పార్టీ మొత్తం ఓడిపోయింది. అప్పుడు కూడా దువ్వాడ శ్రీనివాస్ పై నమ్మకం పెట్టుకుని మరీ జగన్ మోహన్ రెడ్డి చాన్స్ ఇచ్చారు. కానీ జగన్ అవకాశాలు ఇవ్వడం తప్పించి దువ్వాడ శ్రీనివాస్ నెగ్గుకు రాలేకపోతున్నారు అనేది హై కమాండ్ కు నివేదికలు అందాయి. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా ప్రభంజనం వీచినా.. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి దువ్వాడ శ్రీనివాస్ నెగ్గుకు రాకపోవడం వెనుక ఆయన వ్యక్తిగత వ్యవహార శైలి ఉందన్నది ఒక నివేదిక.తన కుటుంబ వ్యవహారాలను వీధిన పడేశారు. తన వ్యక్తిగత జీవితాన్ని పణంగా పెట్టారు. లేనిపోని వివాదాల్లో చిక్కుకున్నారు దువ్వాడ శ్రీనివాస్. అయితే ఆ పరిణామాలు జరిగిన వెంటనే జగన్మోహన్ రెడ్డి ఆయనపై చర్యలు తీసుకోలేదు. కొద్ది నెలల తర్వాత ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. కానీ ధర్మాన సోదరులు పనిగట్టుకుని తనపై సస్పెన్షన్ వేటు వేయించారు అని ఆరోపిస్తూ వచ్చారు దువ్వాడ శ్రీనివాస్. ఇప్పుడు కూడా ఆయన తాను తిరిగి వైసిపిలోకి వస్తానని.. ధర్మాన సోదరుల పని పడతానని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి

-మొదటిపేజీ తరువాయి

మంగళవారం విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్య మాత్రమే. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే సంస్థలు కావు. అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి, నాయకులను తయారు చేస్తాయి. ఈ రోజు జరుగుతున్నది కేవలం ఒక స్నాతకోత్సవం కాదు, ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక" అని అభివర్ణించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, అన్ని వర్గాలు భాగస్వాములైనప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని లోకేశ్ తెలిపారు. "గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలుగా కాకుండా, సామాజిక పరివర్తనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే, ఆ కుటుంబంతో పాటు దేశం కూడా పురోగమిస్తుంది. మన గిరిజన వారసత్వాన్ని కాపాడుకుంటూ, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడమే వికసిత్ భారత్ స్ఫూర్తి" అని ఆయన వివరించారు.

**ఏఐ యుగంలో మానవ విలువల ప్రాధాన్యం**

ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో మానవ విలువల ప్రాధాన్యతను లోకేశ్ నొక్కిచెప్పారు. "ఏఐ మనకు సమాధానాలు ఇవ్వగలదు, కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వం వంటి లక్షణాలను ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అందుకే వర్సిటీలు నైపుణ్యం ఉన్న వృత్తి నిపుణులతో పాటు బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను తయారు చేయాలి" అని ఆయన ఆకాంక్షించారు.

**భవిష్యత్ నాయకులను తయారు చేస్తాం**

ప్రధాని మోదీ కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలే కీలకమని లోకేశ్ అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అభినందనలు తెలుపుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. "మా లక్ష్యం డిగ్రీలు పొందిన విద్యార్థులను తయారు చేయడం కాదు, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడం. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి వర్సిటీ ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి" అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "డిగ్రీ మీకు వృత్తిని ఇస్తుంది, కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదిస్తుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు శాశ్వత వారసత్వాన్ని అందిస్తుంది" అని హితవు పలికారు. అంతకుముందు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో కనెక్టివిటీ కష్టాలకు చెక్..

-మొదటిపేజీ తరువాయి

మారుమూల ప్రాంతాల్లోనూ సెల్ టవర్ల ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉండగా, అదనంగా మరో 2310 టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, అవసరమైన టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి సర్వీస్ ప్రొవైడర్లకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వీలైతే వంద రోజుల వ్యవధిలో ఈ టవర్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కేవలం నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు కూడా సర్వీస్ ప్రొవైడర్లు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వాట్సప్ గవర్నెన్స్ 'మనమిత్ర', సంజీవని వంటి సేవలను ప్రజలు సమర్థంగా వినియోగించుకోవడానికి ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు డిజిటల్ అక్షరాస్యులైతే, మొబైల్ ఫోన్ ద్వారానే మరిన్ని ప్రభుత్వ సేవలను సులభంగా పొందగలరని వివరించారు. త్వరలో ఏఐ అగ్రానమిస్ట్, ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ వంటి వినూత్న సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాతిపదికన అన్ని ప్రాంతాలకూ పూర్తి మొబైల్ కవరేజీ అందిస్తున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతిలో ఎక్కడా తవ్వకాలు జరపకుండా, ప్రతి ఇంటికీ ఫైబర్ ద్వారానే సమాచార నెట్‌వర్క్ అందించే ప్రణాళికను వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, టెలికమ్యూనికేషన్స్ విభాగం అధికారులు, బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్-ఐడియా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు వ్యవహార జ్ఞానం పెంపొందించుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బంగారు పతకాలు ప్రదానం చేశారు. పతకాలు అందుకునేవారిలో 40 శాతం మహిళలు ఉండడం గొప్ప విషయమని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. స్వర్ణ పతకం సాధించిన వారిలో 70 శాతం మహిళలు ఉండడం గర్వకారణమన్నారు. గిరిజన వర్సిటీ విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించే కేంద్రంగా నిలుస్తోందని చెప్పారు. "వంచిత గిరిజన యువతకు వర్సిటీ ద్వారా సరైన న్యాయం జరుగుతుంది. గిరిజన వర్సిటీ విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. అభివృద్ధి పరిణామ క్రమంలో విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి. జీవిత లక్ష్యాలను నిర్దేశించడానికి స్నాతకోత్సవం ప్రేరణగా నిలుస్తుంది. మా గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్ నేను. పుస్తక జ్ఞానంతో పాటు వ్యవహార జ్ఞానం పెంపొందించుకోవాలి. విద్యావంతులుగా ముందుకెళ్లడమే కాదు వెనక్కి తిరిగి చూడాలి. సంస్కృతి పరిరక్షణతో పాటు సమాజ, దేశ భవిష్యత్ నిర్మించాలి.వికసిత్ భారత్ లక్ష్యం దిశగా విద్యార్థుల పాత్ర కీలకం"

ఐతీశీబజుఝుఐఅ వీబతీఎబ ఎఅయిఝఎష్టు ఃశీబతీ : తొలి స్నాతకోత్సవం గిరిజన వర్సిటీకి కీలక మైలురాయని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల దీర్ఘకాల కలలను విశ్వవిద్యాలయం సాకారం చేస్తోందన్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 27.39 లక్షల మంది గిరిజన విద్యార్థులు ఉన్నారని చెప్పారు. గిరిజనులు సాగు చేస్తున్న అరకు కాఫీకి మంచి పేరు వచ్చిందని గవర్నర్ గుర్తుచేశారు.

"గిరిజన సమాజం భిన్న సంస్కృతులు, జీవన విధానాలు కలిగి ఉంది. 2011 జనగణన ప్రకారం రాష్ట్ర గిరిజనుల అక్షరాస్యత రేటు 58.95 శాతం. ఇది దేశ సగటు అక్షరాస్యత కంటే తక్కువగా ఉంది. గిరిజన మహిళల అక్షరాస్యతలో గణనీయమైన పురోగతి. గిరిజన విద్యార్థుల కోసం ఎన్‌టీఆర్ విద్యోన్నతి పథకం."

'గిరిజన వర్సిటీ భవనం శంకుస్థాపన చేసే అవకాశం వచ్చింది. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి రావడం గర్వకారణం. ఈ విషయం విద్యార్థులకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. విద్యార్థులు మరింత బాధ్యతాయుతమైన స్థానానికి రాబోతున్నారు. విద్యార్థుల బాధ్యతాయుతమైన స్థానంతో లక్షలాది మందికి హక్కుల పరిరక్షణ. వందేళ్ల క్రితం భారత్ పరిస్థితి ఎలా ఉంది? ఇప్పుడు ఎలా ఉంది? ఆలోచించాలని" కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

"ఇక్కడి నుంచి వచ్చిన అల్లూరి సీతారామరాజు బ్రిటీషర్లతో పోరాడారు. స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటం చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా విద్యార్థులు ముందడుగు వేయాలి. ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో చారిత్రక గుర్తింపు ఉంది. ఈ తీర ప్రాంతం నుంచి నాగరికత వివిధ దేశాలకు విస్తరించింది. భారత్ నుంచి తమ వారసత్వం వర్ధిల్లిందని శ్రీలంక గర్వంగా చెబుతుంది. దేశం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు పాటుపడుతున్నారు. కొందరు ఈ ప్రాంత విద్యార్థులు కాకపోయినా ఏపీ సంస్కృతిలో భాగమయ్యారు.

# ఆలూరులో మెగా జాబ్ మేళా
# 30 మందికి ఉద్యోగ అవకాశాలు...!





**ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి**

**హోళగుంద,ఆలూరు, జూన్ 30, ప్రజా జ్యోతి న్యూస్-** ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా నిర్వహించిన 'మెగా జాబ్ మేళా' విజయవంతంగా ముగిసింది. ఈ జాబ్ మేళాకు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో సుమారు 11 ప్రముఖ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొనగా, మొత్తం 120 మంది అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 30 మంది అభ్యర్థులను వివిధ కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నాయి. ఇందులో ఫాక్స్‌కాన్ (శ్రీ సిటీ): 15 ,నార్డెక్స్ (చెన్నై): 3 ,ఎన్‌వీహెచ్ ఇండియా (అనంతపురం): 4 ,సన్‌కిసాన్ అగ్రో (ఆదోని): 3 ,జెప్టో (హైదరాబాద్): 3 ,పుష్కల్ (ఆదోని): 2 మొత్తం 30 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో ఈ జాబ్ మేళా మంచి ఫలితాలను సాధించిందనీ, భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో మెగా జాబ్ మేళాలు నిర్వహించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ సాయి తేజ, ఆలూరు కోఆర్డినేటర్ వీరేష్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, మరియు సి వి ఏ పి యు యంగ్ ప్రొఫెషనల్ అలీ పాల్గొన్నారు.

# షీ కమిటీ ఆధ్వర్యంలో బాలికల ఆరోగ్యం, సాధికారత పై అవగాహన కార్యక్రమం.

## ప్రిన్సిపల్ కె.వి రత్నకుమారి



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం,** పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి. రత్నకుమారి అధ్యక్షతన, షీ కమిటీ ఆధ్వర్యంలో నేడు బాలికల ఆరోగ్యం, సాధికారత, సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. అనిత మాట్లాడుతూ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ప్రతి బాలిక సర్వతోముఖ అభివృద్ధికి పునాదులని తెలిపారు. మంచి ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, స్వీయ క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.వి. రత్నకుమారి మహిళా సాధికారత, స్వీయ గౌరవం, విద్య, నాయకత్వ లక్షణాల ప్రాముఖ్యతను వివరించి, ప్రభుత్వం బాలికల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, విద్య, ఆరోగ్య, భద్రత, సాధికారత కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సైబర్ భద్రత అవగాహన కార్యక్రమంలో సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం గోప్యత, ఆన్‌లైన్ మోసాల నివారణ, డిజిటల్ భద్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వేధింపులు, బెదిరింపులు, గోప్యతకు లేదా వ్యక్తిత్వానికి భంగం కలిగే సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అవసరమైతే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. స్వీయ గౌరవం, గోప్యత పరిరక్షణ, ఆరోగ్యం, అవగాహన, సాధికారత ప్రతి బాలికను ధైర్యవంతురాలిగా, బాధ్యతాయుతమైన పౌరురాలిగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ప్రసాద్ రావు, షీ కమిటీ సభ్యురాలు శ్రీమతి ఎ. శోభారాణి, ఇతర మహిళా ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథి డా. అనితను ప్రిన్సిపాల్ శ్రీమతి కె.వి. రత్నకుమారి, షీ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

## రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్సై దామోదర్‌కు బాల్య స్నేహితుల ఘన సన్మానం



**హోళగుంద, జూన్ 30, ప్రజా జ్యోతి న్యూస్ -** రాయదుర్గంలో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా సుదీర్ఘ కాలం సేవలందించి, మంగళవారం పదవీ విరమణ పొందిన దామోదర్ ను ఆయన బాల్య స్నేహితులు ఘనంగా సన్మానించారు. టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, మురళిధర్, శాలి మహబూబ్ బాషా, మల్లయ్య, బజార్ నాగరాజా, బి.టి. హుస్సేన్ షా, సిద్దప్ప, శీను తదితర స్నేహితుల బృందం దామోదర్‌ను కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బాల్య స్నేహితులు మాట్లాడుతూ... హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమతో పాటు పదవ తరగతి వరకు చదువుకున్న దామోదర్, ఆ తర్వాత ఉన్నత చదువులు చదివి, ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టి ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. తమ చిన్ననాటి మిత్రుడు ఉన్నత స్థానానికి చేరుకుని, విజయవంతంగా పదవీ విరమణ చేయడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. పదవీ విరమణ పొందిన దామోదర్ భగవంతుని ఆశీస్సులతో సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో గడపాలని బాల్య స్నేహితులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అనంతరం దామోదర్ ను శాలువా, పూలమాలలతో స్నేహితులంతా కలిసి ఎంతో ఆత్మీయంగా సన్మానించి, వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి



**కుక్కునూరు,ప్రజా జ్యోతి,జూన్ 30 :** కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.64/2026, సెక్షన్ 194(1) బీఎన్ఎస్ఎస్ కింద అనుమానాస్పద మృతి కేసు నమోదు చేయబడిందని కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన మేడి సత్యనారాయణ (55)గత 17 సంవత్సరాలుగా కుక్కునూరు అటవీ రేంజ్ కార్యాలయంలో ప్రైవేటుగా అకౌంట్స్,పేపర్ వర్క్ నిర్వహిస్తూ పనిచేస్తున్నారని,జూన్ 29 తేదీన విధులు నిర్వహిస్తున్న సమయంలో, సాయంత్రం అటవీ శాఖ అధికారులు పులి సంచారం సమాచారం నేపథ్యంలో రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతానికి వెళ్లగా,సత్యనారాయణ కార్యాలయంలో ఒంటరిగా పనిచేస్తున్నారు. 30-06-2026 ఉదయం కార్యాలయానికి వచ్చిన స్వీపర్ ఆయన కుర్చీ పక్కన నేలపై అపస్మారక స్థితిలో పడివుండటం గమనించి,అటవీ అధికారులకు సమాచారం అందించారని,అనంతరం 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించగా,అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి,మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై తెలిపారు.

## శ్రీ సంజీవ రామాలయ ప్రథమ వార్షికోత్సవము

**చెన్నూరు, ప్రజా జ్యోతి, జూన్ 29** పుష్పగిరి గ్రామం నందు నెలకొల్పిన శ్రీ సంజీవ రామాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నుండి బుధవారం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, సాంస్కృత కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు, ఈ వార్షికోత్సవంలో శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధిస్వరులు జగద్గురు శ్రీశ్రీశ్రీ అభినందన విద్యా శంకర భారతి స్వామి వారి ఆశీస్సులతో ప్రథమ వార్షికోత్సవం జరుగుతుందని తెలియజేశారు. బుధవారం ఎనిమిది గంటలకు శ్రీ గురునందనము, వేద స్వస్తి, శ్రీ హనుమాన్ లక్ష్మణ సమేత సీతారామచంద్ర స్వామి వారికి అష్టోత్తర108 శతకాలు అభిషేకము విశేష పూజ మాల మంత్రం మానవములు, మండప దేవత హోమములు. పురుష సూక్త, శ్రీ సూక్త, పూర్ణ హోహుతి, జరుగుతాయి అన్నారు ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవము అనంతరము గిరిజన మంత్రపుష్పము, ఆస్ ప్రవచనము, తీర్థప్రసాదాలు మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని ప్రథమ వార్షికోత్సవం విజయవంతం చేయాలని సంజీవ రామ స్వామి ఆలయ కమిటీ సభ్యులు కోరారు

## విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి.

-- ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బి. రవికుమార్



**పార్వతీపురం, ప్రజాజ్యోతిన్యూస్ సాలూరు** మన్యం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు,డిగ్రీ కళాశాలలు, హాస్టళ్లు మరియు ఇతర విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా అగ్నిమాపక శాఖ అధికారులు,సంబంధిత విద్యాశాఖ అధికారులు తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యాసంస్థల్లో అగ్నిప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్లు,భవన భద్రతా లోపాలు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి అని అన్నారు. అలాంటి ఘటనలు విద్యార్థులు,ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ప్రాణాలకు తీవ్ర ప్రమాదంగా మారుతున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అనేక విద్యాసంస్థల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో లేకపోవడం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం,ఫైర్ అలారం వ్యవస్థలు పనిచేయకపోవడం, విద్యుత్ వైరింగ్ లోపాలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే అవగాహన లేకపోవడం ఆందోళనకర విషయమని పేర్కొన్నారు. అందువల్ల జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు,విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని సంస్థలకు నోటీసులు జారీ చేసి,అవసరమైతే గుర్తింపు రద్దు చేసే వరకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యాసంస్థలో ఫైర్ సేఫ్టీ పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారం వ్యవస్థ, భవన భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలనీ ఆయన కోరారు. అదేవిధంగా?

## 42 సంవత్సరాల సుదీర్ఘ సేవల అనంతరం హెడ్‌మాస్టర్ ఎస్.వి. సుబ్బరాజు గారికి ఘన వీడ్కోలు

**విద్యార్థులు, అధికారులు, ప్రజల సమక్షంలో సన్మాన కార్యక్రమం**



చెన్నూరు మండల పరిధిలోని జెడ్పీ హైస్కూల్ (బాలుర), చెన్నూరులో హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహించిన శ్రీ ఎస్.వి. సుబ్బరాజు గారు 42 సంవత్సరాల సుదీర్ఘ ప్రభుత్వ సేవలను విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందిన సందర్భంగా పాఠశాల ఆవరణలో ఘన వీడ్కోలు మరియు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ సుబ్బరాజు గారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ రావు గారు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీ రామ మోహన్ రెడ్డి గారు మరియు మండల కార్యాలయ సిబ్బంది కలిసి శ్రీ సుబ్బరాజు గారికి శాలువా కప్పి, పూల కుండిని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ రావు గారు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా అంకితభావంతో సేవలందించిన శ్రీ ఎస్.వి. సుబ్బరాజు గారు వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో విశేష పాత్ర పోషించారని కొనియాడారు. వారి నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శప్రాయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీ రామమోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఉద్యోగ జీవితమంతా నిబద్ధతతో సేవలందించిన శ్రీ సుబ్బరాజు గారి సేవలు చిరస్మరణీయమని, వారి అనుభవం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సహోద్యోగులు మాట్లాడుతూ శ్రీ సుబ్బరాజు గారి సేవలను ప్రశంసించి, విద్యార్థుల పట్ల ఆయన చూపిన ప్రేమ, క్రమశిక్షణ, అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం చివరలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు మరియు శ్రేయోభిలాషులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో శ్రీ ఎస్.వి. సుబ్బరాజు గారిని ఘనంగా సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపిడిఓ, చెన్నూరు

## నేడు బదినేహాల్ గ్రామంలో మినీ ట్యాంక్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి రాక

**కౌతాళం జూన్ 30 ప్రజా జ్యోతి** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తెలియజేయడమేమనగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు మంత్రాలయం శాసనసభ్యులు అయినటువంటి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బదినేహాల్ గ్రామానికి గ్రామ ప్రజల కోరిక మేరకు త్రాగు నీళ్ల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన నాలుగు మినీ ట్యాంక్ లను ప్రారంభోత్సవం చేయుటకు విచ్చేస్తున్నారు కావున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,గ్రామ మాజీ సర్పంచ్లు,ఎంపీటీసీలు అన్ని అనుబంధ సంఘాల నాయకులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.



## నల్లకుంట రైతులకు సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ

**రైతు సంక్షేమానికి మరో అడుగు.. నాణ్యమైన వరి విత్తనాల అందజేత**
**సకాలంలో విత్తనాలు.. రైతుల్లో హర్షం**



**ఎటపాక, జూన్ 30 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు పెనుబలి బాలరాజు, కొమరం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే సబ్సిడీపై నాణ్యమైన వరి విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. సకాలంలో విత్తనాలు అందడం పట్ల గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెనుబల్లి సమ్మయ్య, ఉకే వెంకయ్య, గుండె రత్న, మాజీ సర్పంచ్ తెల్లం దుర్గారావు, ఉకే వీరభద్రం, ఉకే మహేష్‌బాబు, కొమరం సుధాకర్, సుబ్బయ్యతో పాటు గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధితో లక్ష్మయ్య కుటుంబానికి రూ.61,107 ఆర్థిక చేయూత

**ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ చొరవతో లక్ష్మయ్య కుటుంబానికి ఆర్థిక భరోసా**

**సీఎం సహాయ నిధి మంజూరుకు కృషి చేసిన కణితి మధు**



**ఎటపాక, జూన్ 30 (ప్రజాజ్యోతి):**పోలవరం జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వేట్టి లక్ష్మయ్య అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందడంతో భారీగా వైద్య ఖర్చులు అయ్యాయి. దీంతో తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ఆయన కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీని ఆశ్రయించారు. ఈ విషయాన్ని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉండేటి రమేష్ స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.61,107 మంజూరు చేయించారు. ఆ చెక్కును బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వేట్టి లక్ష్మయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, కష్టకాలంలో తమకు అండగా నిలిచి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పించిన ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్‌కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, అలాగే తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద ఊయక కన్నయ్య, టీడీపీ నాయకులు ఉండేటి వెంకన్న, పెనుబల్లి సీతయ్య, బాదావత్ సూర్యం, బాదావత్ స్వామి, గుగులోత్ శీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన ని సత్కరించిన జయన్న



**గుంతకల్లు జూన్ 30 (ప్రజా జ్యోతి):** ఉరవకొండ పట్టణంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన ని మరియు ఉపాధ్యాయురాలు రమాదేవి ని యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ టి.జయన్న ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పిల్లలు కు మంచి విద్య ను అందిస్తూ క్రమశిక్షణ ను నేర్పిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం పరితపిస్తున్న గురువులం దరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బోధకులుగా విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా భావితరాల తలరాతను మారుస్తూ సమాజాన్ని సవ్య దిశలో నడిపిస్తున్నారు ఉపాధ్యాయులు. ఈ సంవత్సరం కూడా పదవతరగతి మరియు ఇంటర్ లో మంచి ఉత్తీర్ణత సాధించినందుకు నిరంతర సాధన, ఉపాధ్యాయులు కృషి వలన విద్యార్థులు అందరూ మంచి మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్ఞాన ప్రసూన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ యమ్. చంద్రశేఖర్ మరియు అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా!...

**నిరుపేద కుటుంబానికి అండగా!..**

**తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్!..**



**వి.ఆర్.పురం,జూన్30(ప్రజాజ్యోతి ప్రతినిధి)**ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదవాడికి అండగానిలిచి ఆదుకున్నామని,తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుబొర్రా నరేష్ కుమార్,స్పష్టం చేశారు.మంగళవారం వరరామచంద్రాపురం,మండలం వడ్డిగూడెం గ్రామంలో ఎనకనగిరి లీల,(పెషేంట్)అనారోగ్య కారణాలవల్ల,గతంలో హాస్పిటల్లో చేరడంజరిగిందని తెలిపారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో, రంపచోడవరం,నియోజకవర్గ శాసనసభ్యురాలు మిర్యాల శిరీషాదేవి,చొరవతో బొర్రా నరసింహారావు,బొర్రా సూరిబాబు, ప్రాతినిధ్యంలో హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, "సహాయ నిధి"ద్వారా 34,000/-రూపాయలు చెక్కును పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రామారావు,ఐ.టి.డి.పి,కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి,బొర్రా ఆదినారాయణ,ముత్యాల చంద్రశేఖర్,శంకర్రావు,చెలికాని ఉమామహేశ్వరరావు,జనసేన పార్టీ మండల కార్యదర్శి అంజనరావు చక్రపాణి,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# తోవి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పరుగు పందెం పోటీలు



**కౌతాళం జూన్ 30 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని తోవి గ్రామంలో మంగళవారం రోజున ఏరువాకు పౌర్ణమి పండుగ పురస్కరించుకొని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామ యువకులకు పరుగు పందెం పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మొదటి విజేతగా హెబ్బటం రాజశేఖర్,రెండవ విజేతగా సాతనూరు లక్ష్మన్న వీరు పరుగు పందెంలో గెలుపొందారు. పరుగు పందెంలో గెలుపొందిన యువకులను గ్రామమంతా ఊరేగించి సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో తోవి వాల్మీకి యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# అగ్నిగుండం తొక్కిన భక్తులు!..

## వైభవంగా ముగిసిన కోర్రాజుల సార్లమ్మ జాతర!..







**వి.ఆర్.పురం,జూన్ 30 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** పోలవరం జిల్లా, చింతూరు డివిజన్ వరరామచంద్రాపురం,మండలం రేఖ పల్లి, గ్రామంలో ఆదివాసీ కోర్రాజుల,ఆరాధ్య దైవం శ్రీసార్లమ్మ జాతర మంగళవారం అగ్నిగుండం తొక్కే మహోత్సవంతో భక్తి శ్రద్ధల నడుమ ఘనంగాముగిసింది.చివరి రోజు వేలాది మంది భక్తులు ఒరిస్సా,ఛత్తీష్గడ్,తెలంగాణ, రాష్ట్రాల నుండి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.జాతరముగింపు సందర్భంగా ఆలయ ఆవరణలో సంప్రదాయ బద్ధంగా ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో నిప్పులపై నడిచి తమవిశ్వాసాన్ని చాటుకున్నారు. "జైసార్లమ్మ తల్లి" నినాదాలతో జాతర ప్రాంగణం మార్మోగింది. అగ్నిగుండంతొక్కే వేడుకను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు తండోపతండాలుగా,వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.జాతర సందర్భంగా కోర్రాజుల సంప్రదాయ పూజా విధానాలు, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే ఆచారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోర్రాజుల పెద్దలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు సుఖశాంతులు, సకాలంలో వర్షాలు,పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థనలు చేశారు. వ్యాపారులు, రైతు కూలీలు సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మహిళలు బోనాలు, పసుపు,కుంకుమలతో అమ్మవారికి మొక్కులు చెల్లించగా, కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి ఆశీస్సులు పొందారు. జాతర ప్రాంగణంలో గిరిజన సంప్రదాయ నృత్యాలు,డప్పుల వాయిద్యాలు,భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉట్టిపడేలా చేశాయి జాతరకు వచ్చిన భక్తులఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ యువకులు, స్వచ్ఛంద సేవకులు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో అద్భుతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరముగింపు వేడుకల్లో ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.గిరిజన సంప్రదాయాలు,ఆధ్యాత్మిక విశ్వాసాలను పరిరక్షించడంలో ఇలాంటి జాతరలు కీలకమని వారు పేర్కొన్నారు.ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా!..:వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రేఖపల్లి,వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. సుమారు 60 మంది పోలీస్ శాఖ సిబ్బంది గట్టి బందోబస్తు ఎస్సై ఎస్.డి సాధిక్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ,ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎక్కడాఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.డ్రోన్ కెమెరాలతో అణువణువునా, క్షుణ్ణంగా పరిశీలించారు.అగ్నిగుండం తొక్కేమహోత్సవం అనంతరం ప్రత్యేక హారతులు, పూర్ణాహుతి కార్యక్రమాలతో కోర్రాజుల సార్లమ్మ జాతర వైభవంగా ముగిసింది.

# నిజాలుచెప్పాం నిర్వాసితులకు అండగా నిలిచాం!..

**మాటతప్పం!..ఇచ్చినహామీలను నెరవేరుస్తాం!..**

**తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్!..**

**బొర్రా నరేష్ కుమార్**





**వి.ఆర్.పురం జూన్30(ప్రజాజ్యోతి ప్రతినిధి)**నిజంచెప్పాం నిర్వాసితులకు అండగా నిలిచామని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, చెప్పారు.మంగళవారం పార్టీ ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ!పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని చెప్పాం,ఇచ్చినమాట ప్రకారం కూటమిప్రభుత్వం నిర్వాసితులకు అండగా నిలిచిందని స్పష్టం చేశారు.పోలవరంప్రాజెక్టు నిర్మాణ పనులుచేస్తూనే నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చేవిషయంలో మాటతప్పకుండా చేసే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఆయన వివరించారు.రాబోవు మూడేళ్ళల్లో అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తో కూటమిప్రభుత్వం ముందుకువెళ్తుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అపారమైన గౌరవం ఉందని ఇచ్చినమాటకు కట్టుబడి నిర్వాసితుల పక్షాన నిలిచారని, చెప్పారు. రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి,అసెంబ్లీలో అడుగుపెట్టిన మొదటిరోజు నుంచే నిర్వాసితులపక్షాన నిలబడి మాట్లాడి న్యాయంచేశారని తెలిపారు.అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పోలవరం నిర్వాసితులకు అనుకున్న స్థాయిలో న్యాయం జరిగిందని, చెప్పారు."ఒన్ టైం సెటిల్మెంట్" ఆర్&ఆర్ 1192853 రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారని సూచించారు. అద్భుతమైన ఫలితాలు ప్రతిభంబిస్తున్నాయని, సంతోషం వ్యక్తం చేశారు.నిర్వాసితులకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వంతోనేసాధ్యమని వివరించారు. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు వరంగా మారిందని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం, అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగం, ఉపాధి, రాజధాని,పోలవరం,ఇలా అనేకమైన అద్భుతమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ మాట్లాడిన వారిలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాయం రామారావు, జడ్పీ.టి.సి వాళ్ళ రంగారెడ్డి, సీనియర్ నాయకులు ఆచంట శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బొర్రా నరసింహారావు, బురకా కన్నారావు,మాజీ జడ్పీ.టి.సి ముత్యాల రామారావు, ఐ.టి.డి.పి ఆకోజ్ భాగ్యలక్ష్మి, బీరక సూర్య ప్రకాష్ రావు,ముత్యాల చంద్రశేఖర్, సవలం రాజేంద్రప్రసాద్, పులి సాహెబ్,బొర్రా సూరి,కోట్ల శ్రీనివాసరావు, బాను,బింగి విష్ణుమూర్తి,తదితరులు ఉన్నారు.

# చింతూరులో జూలై 4న జనసేన ప్రతిష్టాత్మక సమావేశం

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న పార్టీ అగ్రనేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు**

**విజయవంతం చేయాలని ఎటపాక జనసేన నాయకులు మొల సతీష్, గల్లా శివ పిలుపు**



**ఎటపాక, జూన్ 30 (ప్రజాజ్యోతి):**చింతూరు మండల కేంద్రంలో ఈ నెల (జూలై) 4వ తేదీన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మక సమావేశం నిర్వహించనున్నట్లు జనసేన నాయకులు వెల్లడించారు. ఈ భారీ సమాయత్త సమావేశానికి జనసేన పార్టీ అగ్రనేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయమై ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జనసేన మండల ఉపాధ్యక్షుడు మొల సతీష్, సీనియర్ నాయకుడు గల్లా శివ సంయుక్తంగా ఒక ప్రకటనలో మంగళవారం తెలియజేశారు. ఏజెన్సీ పరిధిలోని విలీన మండలాలైన ఎటపాక, చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం మండలాలకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఈ సమావేశానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలు, తమ అమూల్యమైన అభిప్రాయాలను, సూచనలను నేరుగా పార్టీ అగ్రనాయకత్వానికి తెలియజేసేందుకు ఈ సమావేశం ఒక గొప్ప వేదిక కానుందని వారు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు తమ పూర్తి వివరాలను (బయోడేటాలను) సమాచార సేకరణ కమిటీకి సమర్పించాలని సూచించారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన వారికి రాబోయే మండల కమిటీల్లో తగిన ప్రాధాన్యత, గుర్తింపు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. జనసేన పార్టీ భవిష్యత్ నిర్మాణానికి, సంస్థాగత బలోపేతానికి ఈ సమావేశం దిక్సూచిలాంటిదని, కావున ప్రతి ఒక్క జనసైనికుడు బాధ్యతగా హాజరుకావాలని వారు కోరారు.

# కంబదూరులో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం

-- సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన





**కంబదూరు జూన్ 30: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** భూమి ఆరోగ్యంగా ఉంటేనే పంటలు ఆరోగ్యంగా పెరిగి రైతుకు అధిక దిగుబడులు, లాభాలు లభిస్తాయని అనంతపురం జిల్లా వనరుల కేంద్రం నిపుణులు పేర్కొన్నారు. భారత ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కంబదూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే)లో సోమవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో రైతులకు భూసార పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రూమాన బేగం మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను అధికంగా ఉపయోగించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి వాటి నివేదికల ఆధారంగా పంటలు సాగు చేస్తే వ్యయాలు తగ్గి అధిక లాభాలు పొందవచ్చన్నారు. జీవన ఎరువుల వినియోగం, విత్తన శుద్ధి, అంతర పంటల సాగు, ఎల్‌నినో పరిస్థితుల్లో పాటించాల్సిన సాగు విధానాలపై రైతులకు సూచనలు చేశారు.అనంతరం గార్లదిన్నె ట్రాక్టర్ నగర్ సంస్థ ప్రతినిధులు భాస్కర్ ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, వాటి వినియోగ విధానం, రైతులకు అందుబాటులో ఉన్న శిక్షణా కోర్సులపై వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను మున్నూరమ్మ వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు అలేఖ్య, మల్లికార్జున, వీఏఏ మౌనికతో పాటు మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# విద్యా రంగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**డిఆర్ఓ కు యుటిఎఫ్ జిల్లా శాఖ వినతి.**



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ జూన్ 30 (ప్రజాజ్యోతి)** విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిఆర్ఓ మల్లికార్జునుడు కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఉదయం కడపలోని జిల్లా కలెక్టరేట్లో విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యలపై డిఆర్ఓ మల్లికార్జునుడుకు యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ విద్యా రంగ, ఉపాధ్యాయుల పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2025 సంవత్సరములో బదిలీ కాబడిన కొందరు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలలోనే కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియకు ముందుగానే వారిని రిలీవ్ చేసి వారు కోరుకున్న స్థానాలకు పంపాలన్నారు. ఈ ఏడాది విద్యాశాఖ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియకు కట్ ఆఫ్ తేదీని జూన్ 20 వ తేదీగా నిర్ణయించడం వల్ల, ఆ తర్వాత పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు పరిగణలోకి రాకపోవడం మూలాన పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. జూన్ 30వ తేదీని ఆధారంగా తీసుకొని రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 45 ప్రకారం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఉన్న లోపాలను పూర్తిస్థాయిలో సవరించి, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అప్పటికి ఉన్న సమస్యలను పరిష్కారం చేసి తర్వాత ఆమోదానికి పంపాలన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నాన్ లోకల్ కేటగిరీలో సెలెక్ట్ అయి సొంత జిల్లాలోకి వెళ్లాలనుకున్న వారికి అంతర్ జిల్లా సాధారణ బదిలీలు నిర్వహించి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యా హక్కు చట్టం 23 (1) కి సవరణ చేయాలన్నారు. చట్ట సవరణ చేసే వరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలను ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. గత ఏడాది ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించబడిన పాఠశాలలకు పలుచోట్ల తగినంత స్థలము లేక తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి పాఠశాలలకు తగినంత స్థలము ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణము చేపట్టాలన్నారు. సమగ్ర శిక్ష, కస్తూర్బా లలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయినీలు, సిఆర్ఎంటి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు మరియు ఇతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు దశలవారీగా వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను త్వరిత గతిన మంజూరు చేసి, నగదు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు సంవత్సరాలుగా చెల్లింపులకు నోచుకోక పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 12వ పిఆర్సీ కమిషన్ ఏర్పాటు, 29 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డిఎ ల విడుదల చేయాలని, ఆర్థిక బకాయిల చెల్లింపు వంటి వాటిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల గ్రాంట్లను గత సంవత్సరం 50 శాతం మాత్రమే విడుదల చేశారని, ఈ సంవత్సరమైనా పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధి నిధులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మనబడి మన భవిష్యత్తు (నాడు-నేడు) లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన తరగతి గదులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మల్లికార్జునుడు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సానుకూలంగా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

# ముగిసిన కొర్రాజుల కొలుపులు!..

నిప్పులగుండం వేడుకకు విశేష స్పందన!..గిరిజన,గిరిజనేత ప్రజలు ఐక్యంగా కొర్రాజుల జాతరను తిలకించారు!..

వేలాదిమంది భక్తులతో కిట,కిట కాడిని జాతర ప్రాంగణం!..కొర్రాజుల,చిన్న సార్లమ్మ,పెద్ద సార్లమ్మ ప్రతీకలను గ్రామంలో ఊరేగింపు!..

లినిప్పులగుండం వేడుకను తిలకించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు!.






వి.ఆర్.పురం,జూన్30(ప్రజాజ్యోతి ప్రతినిధి)జూన్ నెల 20 నుంచి 30 వరకు జాతర తేదీలను,ఆదివాసీ నాయకపోడు, కొండరెడ్ల,కుల పెద్దలు పూజారులు కమిటీ సభ్యులు నిర్ణయించారు.ఈ యొక్క జాతర 11 రోజులపాటు గిరిజన ఆచార సాంప్రదాయాల మధ్య ఎంతో నియమనిష్టలతో జరుగుతుంది,ఇది గిరిజన జాతర అయినప్పటికీ ఈప్రాంతంలో ఉన్నటువంటి అన్నిసామాజిక వర్గాలవారు కలిసి జరుపుకునే పెద్దపండుగ,అద్భుతమైన జాతర, ఈనెల 20 తారీకున ప్రారంభమైన జాతర 30వ తారీకు అగ్నిగుండాలు తొక్కడంతో ఈ జాతర ముగిసింది.ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి రేఖపల్లి గ్రామంలో నాయకపోడు, కొండరెడ్లు,కోయ గిరిజనుల ఆధ్వర్యంలో కొర్రాజుల జాతర కొలుపులు జరుపుకుంటుంటారు. ఈజాతర 11 రోజుల పాటు సంప్రాదయసిద్ధంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ,ఆచారం.ఈ జాతరకు చింతూరు, వేలేరుపాడు, కూనవరం,అశ్వారావుపేట, ఒరిస్సా, ఛత్తీస్గాడ్, తెలంగాణ,తదితర రాష్ట్రాల ప్రజలు, మండలాల నుంచి గిరిజనులు,గిరిజనేతరులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొర్రాజులను దర్శించుకొని మొక్కు బడులు తీర్చుకుంటుంటారు. ఈపండుగకు ఒక విశిష్టత ఉంది. రేఖపల్లి నాయకపోడు గిరిజనులవద్ద కొర్రాజులు, నలుగురు దేవుళ్లు ఉంటారు,వీరి తల్లులైన చిన్న సారలమ్మ, పెద్ద సారలమ్మలు కొండరెడ్డి గిరిజనుల వద్ద ఉంటారు,ఇదిలా ఉండగా ఈ 11రోజులు పండుగను పురస్కరించుకొని ముందుగా గ్రామ పొలిమేరలో దేవరలు, పూజారులు సన్నాయి డప్పులతో వెళ్లి తోరణాలుకట్టడంతో జాతర ప్రారంభమౌతుంది.రెండోవరోజు కొర్రాజులకు ప్రతికైన జెండాను నిలబెడతారు.ఆతర్వాత పూజారి ఇంట్లో ఉన్న కొర్రాజుల ప్రతికైన గొడుగులను తీసుకువచ్చి సంబరం జరుపుకుని వారిని గ్రామ చివరలోఉన్న చెట్టుకింద సాంప్రదాయ సిద్ధంగా నిలబెడతారు.అనంతరం కొండరెడ్డి గిరిజనుల వద్దనున్న కొర్రాజుల తల్లులైన చిన్నసారలమ్మ,పెద్ద సారలమ్మలను అక్కడి గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలుచేసి దారపల్లి గ్రామంనుంచి పెద్దసారలమ్మ, కొటారుగొమ్ము గ్రామంనుంచి చిన్న సారలమ్మను, రేఖపల్లిలోఉన్న తమకొడుకుల వద్దకుతీసుకెళ్లి కొర్రాజలను ప్రతిష్టించిన చోట,ప్రతిష్టింపజేస్తారు.ఆతర్వాత రెండు రోజుల పాటు భక్తులు పెద్దసారలమ్మ,చిన్నసారలమ్మ, వారి నలుగురు కుమారులైన కొర్రాజులకు మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం పద వరోజు అయిన సోమవారం అడవికి వెళ్లి సంద్రకొయ్యలు,తెచ్చి గ్రామం అంతాఊరేగింపు నిర్వహించి తెల్లవార్లు సంబరాలు జరిపి సంద్రకొయ్యలకు నిప్పు పెడతారు.కాలిపోయిన ఆ నిప్పులతో చివరిరోజు మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిప్పులగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొర్రాజుల, చిన్న సార్లమ్మ,పెద్ద సార్లమ్మ ప్రతీకలను గ్రామంలో భక్తుల సందర్శనార్థం,సన్నాయి మేళాలతో,గణాచార్యుల నృత్యాలతో, భక్తుల కోలాహాలల మధ్య ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.ఈనిప్పులగుండం కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలేరుపాడు,చింతూరు, కూనవరం, అశ్వరావుపేట మండలాల నుంచి,ఒరిస్సా, ఛత్తీస్గాడ్, తెలంగాణ, రాష్ట్రాలనుండి,అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కనులారా తిలకించారు.కన్నుల పండువగా జరిగిన ఈనిప్పులగుండం కార్యక్రమానికి, ఆంధ్రప్రదేశ్,రాష్ట్ర బాలాల హక్కుల కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు, తహసిల్దార్ వై సరస్వతి,ఎటపాక సి ఐ కృష్ణ,హాజరయ్యారు. వరరామచంద్రాపురం,ఎస్సై ఎస్.డి సాదిక్,ఆద్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# కేవీకే ఉటుకూరులో నాబార్డ్ తొలి బ్యాచ్ శిక్షణ విజయవంతంగా కొనసాగుతోంది

**చిరుధాన్యాలతో స్వయం ఉపాధిపై రెండు వారాల శిక్షణకు విశేష స్పందన**




**చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి జూన్ 30** ఉటుకూరు, కడప, జూన్ 30: ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రౌ) ఆధ్వర్యంలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), ఉటుకూరులో నాబార్డ్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్న "చిరుధాన్యాలతో స్వయం ఉపాధి" అంశంపై రెండు వారాల శిక్షణ కార్యక్రమం తొలి బ్యాచ్ రెండవ రోజు మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. సోమవారం ఘనంగా ప్రారంభమైన ఈ శిక్షణలో రెండవ రోజు కూడా శిక్షణార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలపై అవగాహన పొందారు.ఈ సందర్భంగా డా. టి. మహేష్ బాబు, శాస్త్రవేత్త (ఎక్స్టెన్షన్), ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన వివిధ చిరుధాన్యాల రకాలు, వాటి ప్రత్యేక లక్షణాలు, అధిక పోషక విలువలు కలిగిన బయోఫోర్టిఫైడ్ రకాల విశిష్టతను వివరించారు. ఈ రకాల సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు పోషకాహార భద్రతకు కూడా దోహదపడుతుందని తెలిపారు.డా. సాయి మహేశ్వరి, శాస్త్రవేత్త (పంట సంరక్షణ), చిరుధాన్యాల ప్రాముఖ్యత, ప్రధాన రకాలు, సాగుకు అనువైన వాతావరణ పరిస్థితులు, సాగు విధానాలు, పంట నిర్వహణ, పురుగులు మరియు వ్యాధుల నివారణ చర్యలపై సమగ్రంగా వివరించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో చిరుధాన్యాల సాగు రైతులకు ఆర్థికంగా ప్రయోజనకరమని పేర్కొన్నారు.డా. ఎస్. ప్రశాంతి, శాస్త్రవేత్త (కమ్యూనిటీ సైన్స్) మరియు నాబార్డ్ ప్రాజెక్టు ఇన్చార్జి, శిక్షణార్థులకు ప్రేరణాత్మక కథల ద్వారా స్వయం ఉపాధి, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం, సమస్యలను అవకాశాలుగా మలుచుకునే నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదగాలంటే కృషి, పట్టుదల, నిరంతర అభ్యాసం అవసరమని సూచించారు.డా. ఐ. సురేష్ కుమార్, శాస్త్రవేత్త (పశుసంవర్ధక శాఖ), చిరుధాన్యాల గడ్డి, పంట అవశేషాలను పశువుల మేతగా వినియోగించే విధానాలు, సమతుల్య పోషకాహారం అందించడంలో వాటి ప్రాముఖ్యత, మేత నిర్వహణ పద్ధతులను వివరించారు. చిరుధాన్యాల ఆధారిత పశుపోషణ ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డా. ఎస్. ప్రశాంతి, డా. టి. మహేష్ బాబు, డా. సాయి మహేశ్వరి, డా. ఐ. సురేష్ కుమార్, నాబార్డ్ ప్రాజెక్టు రీసెర్చ్ అసిస్టెంట్ మిస్ జాంబవి పాల్గొన్నారు.ఈ శిక్షణలో మొత్తం 20 మంది శిక్షణార్థులు పాల్గొని వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు. రానున్న రోజుల్లో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్, వ్యాపార అవకాశాలు, ఆహార భద్రత ప్రమాణాలపై నిపుణులచే శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సెయింట్ పాల్ స్కూల్లో ప్రభుత్వ నిబంధనల అమలుపై సమగ్ర విచారణ జరపాలి

ప్రభుత్వ అనుమతులు, నిబంధనలతోనే పాఠశాలల నిర్వహణ జరగాలి

పాఠశాలల్లో పారదర్శకత ఉండాలి -- చట్టవిరుద్ధ చర్యలు ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల ప్రజాస్వామ్య నిరసనలను అడ్డుకోవడం తగదు

పీ.డి.ఎస్.యు ఆధ్వర్యంలో సెయింట్ పాల్ స్కూల్ దగ్గర ధర్నా




**గుంతకల్లు జూన్ 30 (ప్రజా జ్యోతి):** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలో ఉన్నటువంటి సెయింట్ పాల్ స్కూల్ స్కూల్ దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహించడం.ఈ కార్యక్రమాన్ని ఉద్దే శించి పీ.డి.ఎస్.యు నియోజకవర్గ కార్యదర్శి వి.వినోద్ మాట్లాడు తూ గుంతకల్లు పట్టణంలో రామిరెడ్డి కాలనీ సమీపంలో ఉన్నటువంటి సెయింట్ పాల్ స్కూల్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలను నిర్వహించాలని కోరుతూ విద్యార్థి సంఘాలుగా మేము శాంతియుతంగా వెళ్లి ప్రశ్నించాము. అయితే, మా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బదులు, సెయింట్ పాల్ స్కూల్ యాజమాన్యం బయట వ్యక్తులను (ఔట్సైడర్లను) తీసుకువచ్చి మమ్మల్ని అడ్డుకునే ప్రయత్నం చేసింది. "మీరు ఇక్కడ ధర్నాలు చేయొద్దు, వెళ్లిపోండి"అంటూ ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.ప్రభుత్వ నిబంధనలను పాటిస్తే ప్రశ్నలకు భయపడాల్సిన అవసరం ఏమిటి? విద్యార్థి సంఘాలు లేవనెత్తిన అంశాలకు చట్టబద్ధంగా సమాధానం చెప్పాల్సింది పోయి, బయట వ్యక్తులను ఉపయోగించి అడ్డుకోవడం సరైన విధానం కాదు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, నిజానిజాలను వెలికితీసి తగిన చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నా ము. విద్యార్థి సంఘాల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి, ప్రశ్నించే గొంతులను అణచివేయ డానికి చేసే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలి. లేనిపక్షంలోన పెద్ద ఎత్తున ఆందోళన నిరాసన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని తెలియజేస్తు న్నాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పీ.డి. ఎస్.యు నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు బి.రాజేష్ పీ.డి.ఎస్.యు పట్టణ నాయకులు సాయి, కమల్, సుభాష్, చింటూ, సంతోష్, అజయ్ తదితర నాయకులు పాల్గొనడం జరిగింది.

## గంజాయికి గుడ్బై.. సైబర్ మోసాలకు చెక్..!

తూలుగొండలో మోతుగూడెం పోలీసుల విస్తృత అవగాహన"




**మోతుగూడెం, జూన్ 30: ప్రజా జ్యోతి** చింతూరు మండలం తూలుగొండ గ్రామంలో మోతుగూడెం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్-ఇన్స్పెక్టర్ అబ్దుల్ నస్సిర్ హుసైన్ గ్రామస్థులకు ప్రజా భద్రత, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.పండుగల పేరుతో రహదారులకు అడ్డంగా నిలబడి వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రత్యేకంగా మాట్లాడిన ఎస్ఐ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఆన్లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్వర్డ్లు ఎవరికీ చెప్పరాదని సూచిస్తూ, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని గ్రామస్థులకు సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

## సాలాబాద్ గ్రామంలో కేత్ బచావో అభియాన్ నిర్వహణ



**చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి జూన్ 30** కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప ఆధ్వర్యంలో ఒంటిమిట్ట మండల పరిధిలోని సాలాబాద్ గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డా. ఎ. సుబ్రమణ్యం, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులను వినియోగించడం వల్ల భూకాలుష్యం ఏర్పడటమే కాకుండా, నేల సారవంతత తగ్గి పంటల ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. దీంతో పాటు సాగు ఖర్చులు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ఎరువులను చివరి దుక్కిలో వేయాలని, యూరియాను వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన దశల్లో మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు.మండల వ్యవసాయ అధికారి మంజుల మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఎరువుల లభ్యత, ప్రభుత్వం రైతులకు అందజేయనున్న ఎరువుల పంపిణీ విధానం, అలాగే వివిధ ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాల గురించి వివరించారు.డా. సురేష్ కుమార్ రెడ్డి, పశు విజ్ఞాన శాస్త్రవేత్త మాట్లాడుతూ అజొల్లా పెంపకం ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందడంతో పాటు భూసారాన్ని కూడా పెంచుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.యువ నిపుణులు ఆర్. గిరీష్ కుమార్ మాట్లాడుతూ మట్టి నమూనాలను సేకరించే సరైన విధానం, మట్టి పరీక్ష నివేదికలో పొందుపరిచే అంశాలు మరియు వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండలానికి చెందిన రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు/సహాయకురాళ్లు పాల్గొనగా, 30 మందికి పైగా రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఘన స్వాగతం గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ అధ్యక్షుడు ఇస్లావత్ సూర్య నాయక్

**రాష్ట్రపతి రాకతో అనంతపురం జిల్లాకు ప్రత్యేక గుర్తింపులి**



**కంబదూరు జూన్ 30:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** అనంతపురం జిల్లాకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షులు ఇస్లావత్ సూర్య నాయక్ హృదయపూర్వక స్వాగతం పలికారు. రాష్ట్రపతి పర్యటనతో అనంతపురం జిల్లాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.గిరిజన మహిళగా దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు ఆదర్శప్రాయమైన నాయకురాలని సూర్య నాయక్ కొనియాడారు. ఆమె అనంతపురం జిల్లా పర్యటన గిరిజనులు, విద్యార్థులు, యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు.అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె సందర్శనతో విద్య, అభివృద్ధి, గిరిజన సంక్షేమానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గిరిజన సంక్షేమ సంఘం తరఫున హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తూ, ఆమె పర్యటన విజయవంతం కావాలని సూర్య నాయక్ ఆకాంక్షించారు.

## మరణించిన రైతు కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత!.



**వి.ఆర్.పురం.జూన్ 30(ప్రజాజ్యోతి ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలలో భాగంగా, మరణించిన రైతు కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం ద్వారా రూ.2 లక్షల బీమా సాయాన్నిఅందజేశారు.వివరాలు!ఇలా ఉమ్మడివరం, గ్రామానికి చెందిన సోడే రాజారావు,ఈ ఏడాది ఫిబ్రవరి 26, 2026న అనారోగ్యంతో మరణించారు. ఆయన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాపథకంలో సభ్యుడిగా ఉండడంతో, నామినీ అయిన కుమారుడు సోడే రాంబాబు,కు రూ.2,00,000 బీమా క్లెయిమ్ మంజూరైంది.ఈ సందర్భంగా ఏ.పీ.జీ.బీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు) మేనేజర్ సుధాకర్ చేతుల మీదుగా సోడే రాంబాబుకు రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ, రైతులు మరియు ఖాతాదారులు తక్కువ ప్రీమియంతో లభించే కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలలో చేరాలని సూచించారు.ప్రమాదాలు లేదా సహజ మరణం సంభవించినప్పుడు ఈపథకాలు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది,కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకుని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ బీమా పథకాలలో చేరాలని అధికారులు కోరారు.

## శంఖవరం కేజీబీవీ పాఠశాలలో సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ ఆకస్మిక తనిఖీ.. విద్యా ప్రమాణాలు, వసతులపై సమగ్ర పరిశీలన..



**శంఖవరం, జూన్ 30 (ప్రజా జ్యోతి న్యూస్)** మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)ను సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ (ఇన్‌ఛార్జ) వి.వి.వి. సత్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, వసతులు, విద్యార్థుల అభ్యాస ప్రమాణాలపై సమగ్రంగా పరిశీలించారు.ముందుగా తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని అంచనా వేశారు. విద్యార్థుల నోట్‌బుక్‌లు, రికార్డులు, విద్యా పురోగతిని పరిశీలించి బోధనలో నాణ్యత మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి విద్యా అభివృద్ధిపై ఉపాధ్యాయులు వ్యక్తిగత బాధ్యతతో పనిచేయాలని, ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలకు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.అనంతరం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పరీక్షల సన్నద్ధత, బోధనా విధానాలు, ప్రత్యేక శిక్షణ తరగతులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేలా వినూత్న బోధనా పద్ధతులను అమలు చేయాలని సూచించారు. పాఠశాలలో నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్‌ల పనులను పరిశీలించిన ఏపీసీ, పనుల పురోగతిపై ఆరా తీసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు, అదనపు అవసరాల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. విద్యార్థినుల వసతిగృహాన్ని సందర్శించి భోజనశాల, వంటగది పరిశుభ్రత, మెనూ అమలు, స్టాక్ రిజిస్టర్లు, నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారం నిరంతరం అందేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ (పాల్) ల్యాబ్‌లు, వొకేషనల్ ల్యాబ్‌లను కూడా సందర్శించి అందుబాటులో ఉన్న పరికరాలు, ప్రయోగాల నిర్వహణ, విద్యార్థుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రయోగాత్మక విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా బాలికల విద్య అభివృద్ధి అధికారి శ్రీమతి కె. వెంకటలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయికి దూరం.. సైబర్ మోసాలకు చెక్..! జగ్గవరం క్రాస్ రోడ్డులో కూనవరం పోలీసుల విస్తృత అవగాహన

**రోడ్డు భద్రత, మహిళల రక్షణ, మత్తు పదార్థాల దుష్పరిణామాలు**

**సైబర్ నేరాలపై గ్రామస్థులకు ఎస్ఐ బి. రామకృష్ణ సూచనలు**







**కూనవరం, జూన్ 30: ప్రజా జ్యోతి** కూనవరం మండలంలోని జగ్గవరం క్రాస్ రోడ్డులో కూనవరం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. రామకృష్ణ గ్రామస్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి సహా అన్ని రకాల మత్తు పదార్థాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, పండుగల పేరుతో రోడ్లకు అడ్డంగా నిలబడి వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, మహిళలపై వేధింపులు, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ వెల్లడించరాదని, ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

## గుమ్మకోట గ్రామ యువతకు. గురుకుల పాఠశాల విద్యార్థులకుచట్టాల పై అవగాహన సదస్సు.





**అనంతగిరి: మండల. జూన్ 30. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం గమ్మకోట పంచాయితీ కేంద్రంలో మంగళవారం నాడు గుమ్మ కోట గురుకుల పాఠశాల విద్యార్థులకు.గ్రామ యువతకు పోలీస్ చట్టాలపై గుమ్మ కోట తెలుగుదేశం పార్టీ బూత్ ఇంచార్జి సుర్రా వెంకటేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల అనంతగిరి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ శంకర్రావు పాల్గొన్నారు ముందుగాగుమ్మకోట గ్రామంలో జరుగుతున్న సంత ప్రాంతంలో గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు.అనంతరం ఎస్సై శంకర్ రావు యువతను.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని ముఖ్యంగా గంజాయి జోలికి వెళ్లి జీవితాలునాశనం చేసుకోవద్దని సూచించారు. అదేవిధంగా 18. సంవత్సరాలు నిండిన వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలని వారు కూడా హెల్మెట్ ఉపయోగించాలనితెలిపారు. ఆన్లైన్ మోసాలా పై జాగ్రత్తగా వహించాలని ఏ బ్యాంకు ఓ.టి.పి ఫోన్లో అడగరని గనుక ప్రతి ఒక్కరు ఆన్లైన్ మోసాలకు గురి కావద్దన్నారు. అదేవిధంగా విద్యార్థులు ఇన్ స్టా ఎక్కువగా వాడవద్దని దానివల్ల చదువులు కు దూరం అవుతారని. మనకు ఉపయోగపడే ఈ యాప్ లు వాడాలని తెలిపారు. ముఖ్యంగా యువత చిన్న వయసులో చెడు ప్రయత్నాలు చేయవద్దనిసూచించారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భీమరాజు, గుమ్మ కోట గురుకుల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు సన్నిబాబు, గ్రామస్తులు సన్యాసి దేవుడు, మహేష్, రవి, తదితరులు గుమ్మ కోట పాఠశాలలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నాన్ షెడ్యూల్ ప్రాంతాలను షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్

**వేస్తున్నట్లు అరకు ఎమ్మెల్యే రేగ మత్స్య లింగం వెల్లడి.**



**అనంతగిరి మండలం. జూన్ 30. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. బీంపూలు. గుమ్మ కోట గరుగుబిల్లి. ఎన్.ఆర్ పురం రొంపెల్లి. గ్రామపంచాయతీలు గతంలో గిరిజన పంచాయతీ లుగా గుర్తించబడి ఉండేవని కొందరు స్వార్ధ రాజకీయ నాయకుల వలన నేడు గిరిజన నేతర పంచాయతీలుగా ఐదు పంచాయతీలు గుర్తించబడి ఉన్నాయని ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజానీకం 95.శాతం మంది గిరిజ నులేనని 95. మంది శాతం నివసిస్తున్న గిరిజన పంచాయతీలను గిరిజన నేతర పంచాయతీలుగా ప్రభుత్వం ప్రకటించడంతో స్వచ్ఛమైన గిరిజన ప్రజానీకానికి తీవ్రమైన నష్టం వాటిల్లిందని పేర్కొంటూ గిరిజన ప్రజానీకం తరపున రాష్ట్ర హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేయడం జరుగుతుందని అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం మంగళవారం నాడు ప్రజా జ్యోతి దినపత్రికకు సమాచారం అందించారు. ముఖ్యంగా గిరిజన ప్రజానీకం భూ దోపిడీకి గురవుతున్నారని ఈ దోపిడీ వల్ల ఐదు పంచాయతీల ప్రజలు సర్వం కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ భూములు. రైతుల వ్యవసాయ భూములు కబ్జాపై కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు.

## కాట్రేనికోన అదనపు ఎస్ఐగా విప్పర్తి



**కాట్రేనికోన ప్రజాజ్యోతి** డా బి ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన పోలీస్ స్టేషన్ నుండి ఇటీవల ఏఎస్ఐ నుండి ఎస్ఐ గా పదోన్నతి లభించిన విప్పర్తి సత్యనారాయణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాట్రేనికోన అదనపు ఎస్ఐ గా విచ్చేసారు. విప్పర్తి సత్యనారాయణకు ఎస్ఐ గా పదోన్నతి లభించడంతో పశ్చిమగోదావరి జిల్లా నుండి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కాట్రేనికోన రెండవ ఎస్సైగా రిపోర్ట్ చేసినట్లు తెలిపారు.ఈక్రమంలోనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి రాహుల్ మీనా,అడిషనల్ ఎస్పీ,ఎస్బి సి ఐ,ముమ్మిడివరం సీఐలను మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు.

## ఉప్పినివలస జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయునికి ఘన వీడ్కోలు



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:**మండలం పరిధిలో ఉప్పినివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా సుదీర్ఘ సేవలు అందించిన గురుగుబెల్లి ప్రకాష్‌రావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు కలిసి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆయనపై పూలవర్షం కురిపించి, తమ అభిమానాన్ని చాటుకుంటూ ఘన వీడ్కోలు పలికారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ.. 2019 నుండి 2026 వరకు సదరు పాఠశాలలో గురుగుబెల్లి ప్రకాష్‌రావు అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన పడిన తపన, విద్యాబోధన తీరును గుర్తుచేసుకున్నారు. పదవీ విరమణ పొందిన ప్రకాష్‌రావుకుపలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రకాష్‌రావు సతీమణి సుశీల, కుమారులు ఆదిత్య, అశోక్, కుటుంబ సభ్యులు గురుగుబెల్లి శ్రీనివాసరావు,గురుగుబెల్లి వెంకట్రావు, ధవళ ఉమామహేశ్వరరావు, ధవళ శ్యాంసుందర్రావు గురుగు బెల్లిసింహాసలం, గురుగుబెల్లి నరసింహారావు, గురుగు బెల్లిమనోజ్, సనపల రామ్మోహన్రావు, పైడి నారాయణరావు, పైడి కూర్మారావు, గురుగుబెల్లి మధుసూదన్ రావు, గురుగు బెల్లిసుధాహన్ రావు, గురుగుబెల్లి శ్యామలరావు, గురుగుబెల్లి హరికృష్ణ,గురుగుబెల్లి దిల్లేశ్వరరావు,బొడ్డేపల్లి శ్రీరామ్ మూర్తి, గురుగుబెల్లితేజేశ్వరరావు,ప్రధానోపాధ్యాయురాలు జి.శారద మెట్ట బట్లు మాస్టర్, జల్లేపల్లి శ్రీనివాసరావు, తేజేశ్వరరావు, భారతి రాణి, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## రేపు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిభిరం




**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారి సౌజన్యంతో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రేపు గురువారం నాడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని సేవా సమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ తెలిపారు. పొందూరు మండల కేంద్రంలో స్థానిక అగ్రహారం వీధిలో ఉన్న శ్రీ సత్యసాయి సేవా మందిరంలో గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడునన్నారు. ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు జరుపడునను , పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలి

**టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్**



**రామాపురం జూన్ 30 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ కార్యక్రమం బుధవారం 01 వ తేదీ నాడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు టిడిపి జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి పిల్లిండ్ల మహేష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతతో అమలవుతున్నదని, లబ్ధిదారులకు పెన్షన్లు సమయానికి అందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.రామాపురం మండల పరిధిలో పార్టీ బాధ్యులు, క్లస్టర్/యూనిట్ ఇంచార్జ్లు, గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు మరియు అభిమానులు అందరూ తమ తమ పరిధిలో జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని, లబ్ధిదారులకు సహకరించి అండగా నిలవాలని కోరారు.అలాగే పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా మై టిడిపి యాప్ నందు అప్లోడ్ చేయాలని సూచించారు.

## వెదుళ్లవలస లో దారుణం

**- ఇద్దరు కుమార్తెల గొంతు కోసి తల్లి ఆత్మహత్యాయత్నం!**





**ఆమదాలవలస ప్రజాజ్యోతి న్యూస్ :**ఆమదాలవలస మండలం పరిధిలో వెదుళ్లవలస గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం ఒక అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. బిడ్డల్ని కంటికి రెప్పలా చూసుకునే కన్నతల్లే చిన్నారుల గొంతుకోసి కడతేర్చింది.వివరాల్లోకి వెళ్తే కుటుంబ కలహాల కారణంగా కూర్మాపు వరలక్ష్మి (30) అనే మహిళ తన ఇద్దరు కుమార్తెలు భవాని (3), నాలుగు నెలల పసిపాప చాందినిల గొంతు కోసి దారుణంగా హతమార్చింది. అనంతరం ఆమె కూడా తన గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి తీవ్ర రక్తస్రావమైన వరలక్ష్మిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.చిన్నారులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ వివేకానంద , ఎస్. ఐ బాలరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటన జరిగిన తీరును పరిశీలించిన డీఎస్పీ, అన్ని కోణాల్లో నిష్పాక్షికంగా విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

## రాష్ట్ర స్థాయిలో మెరిసిన శంఖవరం విద్యార్థిని.. 'షైనింగ్ స్టార్'గా సైపిరెడ్డి స్వాతికి మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఘన సత్కారం..



**శంఖవరం : జూన్ 30 (ప్రజాజ్యోతి న్యూస్)** విజయవాడ సమీపంలోని మంగళగిరిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్--2026' కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా శంఖవరం మండలం, శంఖవరం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని సైపిరెడ్డి స్వాతి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుకుని ప్రత్యేక గుర్తింపు పొందింది.పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించిన స్వాతి, రాష్ట్రంలోని అత్యుత్తమ ప్రతిభావంతుల జాబితాలో చోటు సంపాదించి షైనింగ్ స్టార్'గా ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆమెను వేదికపై ఘనంగా సత్కరించి రూ.30 వేల నగదు ప్రోత్సాహకం, తామ్ర పతకం మరియు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను కొనియాడిన మంత్రి, ఇలాంటి విజయాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. శంఖవరం వంటి గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ఈ ఘనత సాధించడం పట్ల జిల్లా విద్యావర్గాలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉంటే గ్రామీణ విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థిని స్వాతిని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్, శంఖవరం మండల విద్యాశాఖ అధికారులు ఎస్.వి. రమణ, టి. గోవింద్, పాఠశాల కమిటీ చైర్మన్ జి. లక్ష్మీజ్యోతి, శంఖవరం గ్రామ పెద్ద పర్వత సురేష్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. వీరరాజు, ఉపాధ్యాయ బృందం హృదయపూర్వకంగా అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.సైపిరెడ్డి స్వాతి సాధించిన ఈ విజయం శంఖవరం మండలానికే కాకుండా కాకినాడ జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని పలువురు విద్యావేత్తలు పేర్కొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రీవెన్స్ సెల్ లో ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన : సిపిఐ



**గోపవరం జూన్ 30 ప్రజా జ్యోతి న్యూస్.......**2026 జూన్ 30వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు, బద్వేలు స్థానిక రాఘవేంద్ర కళ్యాణమండపం నందు, రాష్ట్ర ప్రభుత్వం బద్వేలు నియోజకవర్గం రెవిన్యూ ప్రజా సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ బద్వేల్ పట్టణ కార్యదర్శి కే.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాద్ బాషా లతో కూడిన సిపిఎం బృందం, బద్వేలు స్థానిక ఊరి చివర్లలో కొండ తిప్పలపై గత 30 సంవత్సరాలుగా నివాసాలు ఉంటున్న నిరుపేదల కాలనీలైన పుచ్చలపల్లి సుందరయ్య నగర్, చాకలి ఐలమ్మ కాలనీ, జ్యోతి బోస్ కాలనీల ప్రజలతో కలిసి, వారి స్థానిక ప్రజల సమస్యలపై బద్వేలు ఆర్డిఓ చంద్రమోహన్ గారిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ...2002లో భారతదేశ తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి పేరిట కాలనీ నిర్మాణం జరిగిందని, 2008 లో నిరుపేదలతో కామ్రేడ్ చాకలి ఐలమ్మ కాలనీ నిర్మాణం చేశామని, 2016లో కామ్రేడ్ జ్యోతిబసు పేరిట వికలాంగులులతో కాలనీ నిర్మాణం జరిగిందని, నేటికీ రెండు, మూడు దశాబ్దాలు పూర్తయిన సుమారు పదివేల మంది ప్రజలు నివాసాలు ఉంటున్న ఇప్పటి వరకు వారికి త్రాగునీరు, రోడ్లు, కరెంటు, స్కూలు, అంగన్వాడి సెంటరు, ప్రాథమిక వైద్య కేంద్రం, డోర్ నెంబర్లు, ఇంటి పన్నులు లాంటి కనీస మౌలిక సౌకర్యాలు అందడం లేదన్నారు. సిపిఎం చేసిన ప్రజా పోరాటాల కారణంగా గతంలో మంత్రి గర్ల అరుణకుమారి, ఎం.పీ.లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాలనీలను సందర్శించి పేదలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని వాగ్దానాలు ఇచ్చారని ఈ ప్రభుత్వం ఆ ప్రభుత్వం అనకుండా అన్ని ప్రభుత్వాలు పాలకులు మాట తప్పారని జిల్లాఅధికారు అయినా ఇప్పుడున్న స్థానిక అధికారు లైన పేదల కష్టాలు గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆర్డీవో చంద్రమోహన్ గారు స్పందిస్తూ తప్పకుండా నిధుల విడుదలకు, నివేదికలు తయారు చేసి పంపిస్తామని, వివిధ ప్రభుత్వ శాఖల సంబంధిత అధికారులను పిలిపించి మాట్లాడి, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ ఖైరున్ బి, సుబ్బరాయుడు, ఆర్.ఓబయ్య, మూరా ప్రసాద్, శ్రీను, కొండయ్య, రాజగోపాల్, బాలమ్మ, మూడు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## పొందూరు కాటన్ చీరలకు కేంద్ర బృందం భౌతిక పరిశీలన

- ఓడిఓపీ మూల్యాంకనలో భాగంగా పర్యటించిన కేంద్ర మూల్యాంకన బృందం
- ఉత్పత్తి విధానం , నూలు తయారీ , మగ్గం నేయడం వంటి ప్రక్రియలపై ప్రత్యక్ష పరిశీలన
- స్థానిక చేనేత కళాకారులతో ఆత్మీయంగా మమేకం









**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**కేంద్ర వాణిజ్య , పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డి.పి.ఐ.ఐ.టి), భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓ.డి.ఓ.పి) మూల్యాంకన బృందం నేడు శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు మండలములో "పొందూరు కాటన్ చీరలు" ఉత్పత్తికి సంబంధించి భౌతిక పరిశీలన నిర్వహించారు.మూల్యాంకన బృందానికి తండ్యాంమెట్ట గ్రామంలో జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి టి. జనార్ధనరావు, శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బృందం తండ్యాంమెట్ట గ్రామంలో స్థానిక చేనేత కార్మికులతో సమావేశమై వారి సంప్రదాయ నైపుణ్యాలను, "పొందూరు కాటన్ చీరలు" ఉత్పత్తి విధానాన్ని, నూలు తయారీ, మగ్గం నేయడం వంటి ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పొందూరు కాటన్ చీరల ప్రదర్శనను తిలకించి, స్థానిక చేనేత కళాకారులతో ఆత్మీయంగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.అనంతరం ఆంధ్ర ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘంను సందర్శించి సంప్రదాయ నూలు వడకడం, నేయడం వంటి ప్రక్రియలను పరిశీలించడంతో పాటు అక్కడ ప్రదర్శించిన ఉత్పత్తులను వీక్షించారు. వీటితోపాటు పొందూరులోని శ్రీ సాయిబాబా వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన కామన్ ఫెసిలిటీ సెంటర్ (సి.ఎఫ్.సి) భవనాన్ని, చేనేత ఉత్పత్తులను నేయబడుతున్న వస్త్రాలను పరిశీలించారు. అలాగే చిత్రికా స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న విక్రయ కేంద్రాన్ని సందర్శించి స్థానిక చేనేత కళాకారులు తయారు చేస్తున్న పొందూరు కాటన్ చీరలు, ఇతర ఉత్పత్తులను పరిశీలించిన మూల్యాంకన బృందం అనంతరం శ్రీకాకుళం కలెక్టరేట్‌కు చేరుకొని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ లను గౌరవ పూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమం అమలు, పొందూరు కాటన్ చీరల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, చేనేత కార్మికుల సంక్షేమం, మార్కెటింగ్, మౌలిక వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై జిల్లా కలెక్టర్ గమూల్యాంకన బృందానికి సమగ్రంగా వివరించారు.మూల్యాంకన బృందం జిల్లాలో సంప్రదాయ చేనేత రంగ పరిరక్షణకు, పొందూరు కాటన్ చీరల ప్రాచుర్యానికి జిల్లా యంత్రాంగం, చేనేత మరియు జౌళి శాఖ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చేనేత కార్మికులు సమిష్టిగా చేస్తున్న కృషిని అభినందించారం ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ మూల్యాంకన బృందం సృష్టి ,హర్ ప్రీత్ సింగ్,జిల్లా చేనేత, జౌళి అధికారి టి.జనార్ధనరావు , ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం కార్యదర్శి దండా వెంకట రమణ ,సాయిబాబా వీవర్స్ సొసైటీ మేనేజర్ వట్టం శ్రీనివాస్ రావు,అభివృద్ధి అధికారులు వి.జి.శంకరరావు ఎస్. రమణమ్మ ఆర్.శేఖర్,, ఎం. రాజారావు, చేనేత కార్మికులు కార్యక్రమములో పాల్గొన్నారు.

## హోం శాఖపై వైసీపీ ఆర్టీఐ జోన్ 2 అధ్యక్షులు కొల్లు త్రినాధ వర్మ తీవ్ర విమర్శలు

--శాంతిభద్రతలు క్షీణించాయి-సీసీ కెమెరాలపై ప్రభుత్వ ప్రకటనలు అవాస్తవమని ఆరోపణ
--కృష్ణలంక లాకప్ డెత్ ఘటనపై సిట్ దర్యాప్తుపై అనుమానాలు
--హోం మంత్రి అనిత రాజీనామా చేయాలని డిమాండ్
--విశాఖ అభివృద్ధిపైన విమర్శలు మాదకద్రవ్యాల నియంత్రణలో విఫలం
-- ఆక్వా రైతులకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపు




**అంబేద్కర్ కోనసీమ జిల్లా జూన్ 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా క్షీణించిందని హోం శాఖ పూర్తిగా విఫలమైందని వైయస్ఆర్సీపీ రాష్ట్ర ఆర్టీఐ వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు త్రినాధ వర్మ తీవ్రంగా విమర్శించారు.హోం మంత్రి అనిత అనుభవరాహిత్యం కారణంగానే శాఖపై నియంత్రణ కోల్పోయారని ఆయన ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న విధంగా 70 వేల సీసీ కెమెరాలు ఉన్నాయని ప్రకటించినప్పటికీ,వాస్తవానికి పోలీస్ స్టేషన్లలోనే అవి సమర్థవంతంగా పని చేయడం లేదని ఆయన అన్నారు. దర్యాప్తులకు అవసరమైన కీలక ఆధారాలు అందుబాటులో లేకపోవడం పోలీస్ వ్యవస్థ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.లాకప్ డెత్ ఘటనపై సిట్ దర్యాప్తుపై అనుమానాలు సాయి కృష్ణ లాకప్ డెత్ ఘటనపై ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై త్రినాధ వర్మ అనుమానాలు వ్యక్తం చేశారు.అదే శాఖ పరిధిలో దర్యాప్తు జరగడం వల్ల పారదర్శకతపై ప్రజలకు నమ్మకం తగ్గుతోందని అన్నారు.ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కుటుంబ సభ్యులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.సిట్ దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు.హోం శాఖ పూర్తిగా విఫలమైందని, ప్రజల భద్రతను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. వెంటనే హోం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విశాఖపట్నం అభివృద్ధి పేరుతో ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన ఆరోపించారు.భూముల కేటాయింపులు, నగర అభివృద్ధి విధానాలు సామాన్య ప్రజలకు నష్టం కలిగించేలా ఉన్నాయని అన్నారు.గీతం యూనివర్సిటీ వంటి ప్రైవేట్ సంస్థలకు భూములు అతి తక్కువ ధరలకు కేటాయించారని విమర్శించారు.రాష్ట్రంలో గంజాయి సహా మాదకద్రవ్యాల మాఫియా పెరుగుతోందని,యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు.ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని త్రినాధ వర్మ హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఆక్వా రైతుల ఆందోళనలకు వైఎస్ఆర్సీపీ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

## మహిళా కమిషన్ ముందుకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్-మద్దతుగా మురళీ కృష్ణంరాజు హాజరు



**కాకినాడ జిల్లా జూన్ 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయి రాజకీయ సమావేశం జరిగింది.అనకాపల్లి జిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రి,ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ కో-ఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్‌కు మద్దతుగా ఈ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు పాల్గొని కీలక నేతలతో కలిసి అమర్నాథ్‌కు తమ మద్దతు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై గుడివాడ అమర్నాథ్‌కు సంఘీభావం తెలిపారు.హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర మహిళా కమిషన్ పిలుపు మేరకు అమర్నాథ్ విచారణకు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## ఘనంగా హజరత్ షాహీ మహమ్మద్ శ్రీ గౌస్ పీర్ షా ఖాద్రి వలీ స్వామి వారి ఉరుసు ఉత్సవాలు........

గంధములో పాల్గొన్న శ్రీమతి ఇందిరమ్మ..........




**చాగలమర్రి జూన్30( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన హజరత్ షాహీ మహమ్మద్ శ్రీ గౌస్ పీర్ షా ఖాద్రి వలీ స్వామి వారి ఉరుసు ఉత్సవాల సందర్భంగా మంగళవారం గంధం మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీనియర్ నాయకురాలు శ్రీమతి ఇందిరమ్మ సమక్షంలో పకీరుల మేళ తాళాల నడుమ ఫాతేహాలు సమర్పించారు.రంగు రంగుల విద్యుత్ దీపాలతో దర్గాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు గౌస్ పీర్ షా నిర్వహించారు. గంధం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ గౌస్ పీర్ షా ఖాద్రి స్వామి వారిని దర్శించుకున్నారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ లాలూ మియా ఖాద్రి మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు పంటలు బాగా పండాలని, లోక కళ్యాణం కోసం కూడా శ్రీ స్వామి వారికి ప్రత్యేకంగా ప్రార్థనలు జరిపినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ నాయకులు షేక్ బాబులాల్ చక్రం బీడీ అధినేత ముల్లా షబ్బీర్ అహమ్మద్ లాలుమియ ఖాద్రి కుమారులు సయ్యద్ గౌస్ పీర్ ఖదీర్ ఖాజాపీర్ షరీఫ్ రఫీ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్ ను త్వరితగతిన పూర్తి చేయాలి


- తహశీల్దార్ పణీంద్రుడు

పత్రాలను అందజేస్తున్న తహసీల్దారు .....



**చాగలమర్రి , జూన్ 30( ప్రాజాజ్యోతి న్యూస్ ) ;** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను (సర్) ప్రణాళికాయుతంగా త్వరితగతిన పూర్తి చేయాలని వీణవంక తహసీల్దార్ పణీంద్రుడు బీఎల్‌వోలను ఆదేశించారు. చాగలమర్రి పట్టణంలోని పలు వార్డులలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ చేపడుతున్న తీరును ఆయన మంగళవారం పరిశీలించి, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ కార్యక్రమం పారదర్శకంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని బీఎల్ఓ,బిఎల్ఏలకు సూచించారు. ఓటర్లకు సైతం అవసరమైన అవగాహన కల్పించి, ప్రక్రియను సజావుగా సాగేలా చూడాలన్నారు.

## కాలువ లస్కర్ రామలింగ పదవీ విరమణ అధికారులు,సిబ్బంది ఘన సన్మానం



**హాలహర్వి జూన్ 30, ప్రజా జ్యోతి :-** హాలహర్వి మండలం బాపురం ఎల్ఎల్‌సి కాలువ లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రామలింగ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.బి.రామలింగ గత కొన్ని సంవత్సరాలుగా కాలువ లస్కర్‌గా నిబద్ధతతో, అంకితభావంతో సేవలందించారని అధికారులు కొనియాడారు. కాలువల నిర్వహణ, నీటి పంపిణీ, రైతుల సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. తోటి సిబ్బంది, అధికారులు ఆయన సేవలను స్మరించుకుంటూ పదవీ విరమణ జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

# గంజాయి,డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

-సిఐ బిఎస్ అప్పారావు,ఎస్సై లక్ష్మీకాంతం

--ప్రత్తిపాడు అఖిల్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు పోలీసులు అవగాహన





**కాకినాడ జిల్లా జూన్ 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి ఎస్ అప్పారావు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం సూచించారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఉత్తర్వులు,పెద్దాపురం ఎస్‌డీపీవో ఏబీజీ తిలక్ ఆదేశాలతో మంగళవారం ప్రత్తిపాడులోని అఖిల్ విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్,గంజాయి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని,క్షణిక ఆనందం కోసం వాటి బారిన పడితే జీవితాంతం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు.అఖిల్ విద్యా సంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు.గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1972,అత్యవసర సేవల నంబర్ 112, ప్రత్తిపాడు ఎస్సై 9440796570, సీఐ 9440796530కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిల్ విద్యా సంస్థల చైర్మన్ ఇనకోటి గంగాధర్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలకు కూటమి ప్రభుత్వం మొండిచేయి

**మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి**

**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** సూపర్ సిక్స్' హామీలు సూపర్ మోసాలుగా మారాయి ఎన్నికల సమయంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు భారీగా ఇస్తామని, 'సూపర్ సిక్స్' పేరుతో కొండంత ఆశలు చూపిన టీడీపీ కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక మహిళలకు తీవ్ర అన్యాయం చేస్తూ మొండిచేయి చూపించిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి మహిళల సంక్షేమంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, వారిని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేశారని విమర్శించారు.కూటమి పాలనలో శూన్యమైన మహిళా సాధికారత. ఎన్నికల ప్రచారంలో డ్వాక్రా మహిళలను ఆకాశానికెత్తేలా హామీలు గుప్పించి, ఇప్పుడు వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వడ్డీ లేని రుణాల పరిమితి పెంచుతామని చెప్పి, నేడు ఆ ఊసే ఎత్తడం లేదు.మహిళల నమ్మకాన్ని వమ్ము చేశారు. 'సూపర్ సిక్స్' హామీల పేరుతో మహిళలను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు నాయుడు అధికార పీఠం ఎక్కగానే ఆ హామీలన్నింటినీ అటకెక్కించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత అనేది ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తిగా శూన్యమైంది.గడిచిన ఐదేళ్ల వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలో మహిళల ఆర్థిక ఇబ్బందులను తీర్చి, వారిని ప్రతి ఇంట్లో 'మహాలక్ష్మి'లా గౌరవించారని రెడ్డి శాంతి గుర్తు చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వం డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో చేసిన మోసాన్ని జగనన్న 'వైఎస్ఆర్ ఆసరా' ద్వారా నాలుగు విడతల్లో వేల కోట్ల రూపాయలను నేరుగా మహిళల ఖాతాల్లో వేసి తీర్చారు. 'వైఎస్ఆర్ చేయూత' ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారు. మహిళలపై వడ్డీ భారం పడకుండా, సకాలంలో రుణాలు చెల్లించిన ప్రతి పొదుపు సంఘానికి 'సున్నా వడ్డీ' పథకం కింద వడ్డీ సొమ్మును ప్రభుత్వమే భరించి మహిళల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది.నామినేటెడ్ పదవుల నుంచి స్థానిక సంస్థల వరకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళలను నిజమైన పాలకులుగా మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే. అధికారం కోసం అబద్ధపు హామీలతో మోసం చేసిన టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని మహిళా లోకం గమనిస్తోందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పగటి ప్రగల్భాలు పక్కన పెట్టి, డ్వాక్రా మహిళలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను, వడ్డీ లేని రుణాల వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.




# బద్వేల్‌లో ప్రజా సమస్యలపై జేసీ ప్రత్యక్ష సమీక్ష






**- 87 కొత్త అర్జీల స్వీకరణ**

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 30 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్లే బృహత్తర కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నాలుగో విడత సోమవారం బద్వేల్‌లో సజావుగా సాగింది. ఒక నియోజకవర్గం – ఒక నెల – నాలుగు పర్యటనలు విధానంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా బద్వేల్‌లోని శ్రీ రాఘవేంద్ర గ్రాండ్‌లో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఒక్కో వినతిని స్వయంగా పరిశీలించిన జేసీ, సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్య పరిష్కారంలో జాప్యం వహిస్తే సహించేది లేదని ఆమె అధికారులను హెచ్చరించారు. ఈ వేదికపై మొత్తం 87 మంది బాధితులు తమ సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. బద్వేల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు మూడు విడతలుగా జరిగిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 672 వినతులు అందాయి. వాటిలో 65 సమస్యలకు ఇప్పటికే పూర్తి పరిష్కారం చూపామని, మిగిలిన అర్జీలు వివిధ దశల్లో పరిశీలనలో ఉన్నాయని ఆర్డీఓ చంద్రమోహన్ వివరించారు. నిర్ణీత గడువులోగా పెండింగ్ అర్జీలన్నీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి వివిధ శాఖల జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులపై డీసీసీబీ చైర్మన్ ఫైర్

- గోపవరం ఎమ్మార్వో, డీటీ, వీఆర్వోల తీరుపై సూర్యనారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం
- భూ సమస్యల్లో జాప్యం వద్దు.. అర్హులకు వెంటనే న్యాయం చేయాలి
- స్పందించని అధికారులను వదిలేది లేదు..
- బాధితుల పక్షాన కార్యాలయాల ముందే ధర్నా చేస్తా



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 30 (ప్రజా జ్యోతి)** బద్వేల్ భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటే సహించేది లేదని డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి రెవెన్యూ అధికారులను గట్టిగా హెచ్చరించారు. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని గోపవరం మండల ఎమ్మార్వో, డిప్యూటీ తాసిల్దార్ (డీటీ), వీఆర్వోల పనితీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి మరియు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు ఫోన్ చేస్తే అధికారులు తప్పనిసరిగా స్పందించాలని, నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని ఆదేశించారు. భూ వివాదాల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకూడదని సూర్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం రికార్డుల ఆధారంగా, పారదర్శకంగా భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన పేదలకు వెంటనే న్యాయం చేయాలని సూచించారు. కొందరు అధికారులు రౌడీ గ్యాంగులకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ.. అలాంటి శక్తులకు దూరంగా ఉండి, ప్రజల పక్షాన నిలబడాలని అధికారులకు హితవు పలికారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఊరుకోను. అవసరమైతే బాధితుల తరఫున రెవెన్యూ కార్యాలయాల ఎదుటే ధర్నాకు దిగుతాను అని సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ప్రజల సమస్యల పట్ల స్పందించని ఏ ఒక్క అధికారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో భూ బాధితులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే పితాని

**211 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పితాని**
**ప్రభుత్వం విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్‌లను అందించడం అభినందనీయం**
**చిన్నారులు గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం**
**చిన్నారులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన ఆహారం అందించేందుకు తగిన ప్రాధాన్యత**
**ఐసిడిఎస్ ద్వారా మేలైన సేవలు అందించే దిశ ప్రభుత్వం కట్టుబడి ఉంది**



**పోదూరు, ప్రజాజ్యోతి, జూన్ 30:** అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణి స్త్రీలకు, బాలింతలకు మేలైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి, ఏపీ శాసనసభ హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్, టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు.మంగళవారం పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట మండలాలకు చెందిన మొత్తం 211 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో వంట కార్యక్రమాలు ఎలాంటి అంతరాయం లేకుండా, సురక్షితంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్‌లను అందించడం అభినందనీయమైన నిర్ణయమని ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో ఆధునిక వంట సదుపాయాలు కల్పించడం వల్ల వంట ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు ఇంధన వ్యయం తగ్గి, కార్యకర్తల శ్రమ కూడా తగ్గుతుందని తెలిపారు.ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి, చిన్నారులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం దశలవారీగా అందజేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అంగరం కృష్ణకుమారి, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి సేవల ద్వారానే సమాజంలో గుర్తింపు: సీఐ డి.వెంకటేశ్వరరావు



**బేతంచెర్ల: జూన్ 30(ప్రజా జ్యోతి)**బేతంచెర్ల, మంగళవారం ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సమాజానికి అందించే సేవల ద్వారానే గుర్తింపు లభిస్తుందని సీఐ డి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన షేక్షావలి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సీఐ డి. వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, షేక్షావలి పోలీసు శాఖలో ఎంతో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం షేక్షావలి తనతో కలిసి పనిచేసిన సహచర అధికారులు, సిబ్బందికి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.::::

## విశాఖ లో రెండేళ్ల పాలనకు బ్రోచర్ ఆవిష్కరణ.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం** కూటమి పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు విశాఖపట్నం లో గౌరవ రాష్ట్ర విద్యాశాఖమాత్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు మరియు సహచర ఎమ్మెల్యేలు,ఎంపీ లతో కలసి బ్రోచర్ ఆవిష్కరించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రైవిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు.

## పేదల సేవలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

**పోదూరుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పితాని హాజరు..**
**ఆయన చేతుల మీదుగా పింఛన్ పంపిణీ**



**పోదూరు, ప్రజాజ్యోతి, జూన్ 30:** ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, స్నేహశీలి, ఆపద్బాంధవుడు, మాజీమంత్రి ఏపీ శాసనసభ హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ టిడిపి రాష్ట్ర పోలీస్ బ్యూరో సభ్యుడు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్య నారాయణ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల పింఛన్ సొమ్మును బుధవారం పోదూరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ‘ పేదల సేవలో పితాని’ కార్యక్రమంలో భాగంగా పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును ఆయన చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారని, పోదూరు టిడిపి మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్ రాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రరాజు రవిరాజు, ఆచంట ఏఎంసీ డైరెక్టర్ బండి సత్యనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షుడు బొంతు కాశీ విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి కుసుమే శ్రీకాంత్ తదితర కూటమి శ్రేణులు మంగళవారం ఒక ప్రకటనలు తెలిపారు. ముఖ్య అతిథిగా ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హాజరుకానున్న కార్యక్రమం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభిస్తారని గ్రామస్తులు, పింఛన్ లబ్ధిదారులు, కూటమి నాయకులు తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## 41 ఏళ్ల విశిష్ట సేవలకు ముగింపు... ఆర్ఎస్ఐ కర్రి బొజ్జయ్య పదవీ విరమణ

**--1985లో కానిస్టేబుల్‌గా చేరి ఆర్ఎస్ఐ స్థాయికి ఎదిగిన బొజ్జయ్య**
**--నక్సల్ విధులు నుంచి వీఐపీ బందోబస్తు వరకు నిబద్ధతతో సేవలు**
**--11 నగదు బహుమతులు,14 జీఎస్ఈలు,ప్రభుత్వ సేవా పతకంతో విశిష్ట గుర్తింపు**



**కాకినాడ జిల్లా జూన్ 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** పోలీసు శాఖలో నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించిన రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ) కర్రి బొజ్జయ్య మంగళవారం పదవీ విరమణ పొందారు.అడ్డతీగల మండలం మట్లపాడు గ్రామానికి చెందిన కర్రి బొజ్జయ్య 1985 మార్చి 26న ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) మూడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఆర్ఎస్ఐ),రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ)గా పదోన్నతులు పొందుతూ సుమారు 41 ఏళ్లకు పైగా శాఖలో విశిష్ట సేవలందించారు.తన సుదీర్ఘ సేవా కాలంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు,శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రముఖుల బందోబస్తు వంటి కీలక బాధ్యతలను నిబద్ధత,నిజాయితీ, క్రమశిక్షణతో నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు.ఆయన సేవలకు గుర్తింపుగా ఉన్నతాధికారుల నుంచి 11 నగదు బహుమతులు, 14 జీఎస్ఈలు,రెండు ప్రశంసాపత్రాలు అందుకున్నారు.అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవా పతకాన్ని కూడా అందుకుని విశిష్ట సేవలకు గుర్తింపు పొందారు.పదవీ విరమణ సందర్భంగా సహోద్యోగులు,అధికారులు, మిత్రులు కర్రి బొజ్జయ్యను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలు,ఆనందం, సుఖశాంతులు,అష్టైశ్వర్యాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడీ సహాయకులకు ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత



**కాకినాడ జిల్లా జూన్ 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం పెదశంకర్ల పూడి గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంగళవారం అంగన్వాడీ సహాయకుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.శంఖవరం మండలంలోని శంఖవరం,డి పోలవరం,కత్తిపూడి (కె.జంగాలపేట), రాజవరం, మాసంపల్లి, ఆవెల్తి గ్రామాలతో పాటు రౌతులపూడి మండలంలోని దబ్బాది,గిన్నిలారం,ఆర్ వి పురం రాఘవపట్నం,ఎస్ పైడిపాల, ఎన్ వి నగరం,ఎం కొత్తూరు గ్రామాలకు చెందిన అంగన్వాడీ కేంద్రాల సహాయకులకు నియామక పత్రాలను ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదగా అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్,రాష్ట్ర టీఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు వెన్నా శివ,టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు పర్వత సురేష్,నియోజకవర్గ సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు,వజ్రకూటం మాజీ సర్పంచ్ కీర్తి వెంకట సుభాష్,కత్తిపూడి సొసైటీ అధ్యక్షుడు గాబు కృష్ణమూర్తి,రౌతులపూడి మండల పార్టీ అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, సిడిపివో పర్వత వెంకటలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్స్ బి వి రజని, వి నాగ మణి, సీనియర్ అసిస్టెంట్ వై.విజయ్ కుమార్,వివిధ గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి ......

**- సహాయ సంచాలకులు వరప్రసాద్......**

సన్మానిస్తున్న సిబ్బంది.........



**చాగలమర్రి , జూన్ 30( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మద్దూరు పశువైద్య కేంద్రంలో లైవ్‌స్టాక్ అధికారి మురళికృష్ణ మంగళవారం రిటైర్డ్ అయ్యారు. ఈ సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో సన్మాన సభ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మూగజీవాలకు,పాడిరైతులకు ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆయన శేషజీవితం ప్రశాంతమైన వాతావరణంలో గడవాలని, ఆయూరారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మురళికృష్ణ దంపతులను సహచర ఉద్యోగులు,పశు సంవర్ధక శాఖ సిబ్బంది, కుటుంబీకులు, బంధుమిత్రులు పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు దీపాకుమారి, నందిని,సాయి బాబా, పుల్లయ్య, రవీంద్రారెడ్డి,పశువైద్య సిబ్బంది, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

## వేలేరుపాడు అటవీ ప్రాంతానికి పులి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :అటవీ శాఖ



**వేలేరుపాడు : 30 జూన్ వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )**వేలేరుపాడు మండలం కుకునూరు రేంజ్ చిగురుమామిడి బీట్ లోని సిద్దారం అటవీ సమీపానికి పెద్ద పులి చేరుకున్నట్టు అటవీ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది, బుట్టాయిగూడెం నుండి బయలు దేరిన పులి మంగళవారం రాత్రి 7:00 గంటలకు సిద్ధారం అటవీ ప్రాశీతం లోనికి ప్రవేషించిందని ప్రజలు, పశువులని అడవి లోనికి తీసుకెళ్లవద్దని హెచ్చరించడం జరిగింది, పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ఫారెస్ట్ బృందాలు, బోనును ఏర్పాటు చేయడం జరిగింది.

## రేపు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలి

**టిడిపి మండల అధ్యక్షుడు గాలివీటి సురేంద్ర రెడ్డి**




**రామాపురం జూన్ 30 ప్రజా జ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా” పెన్షన్ కార్యక్రమం బుధవారం జులై 01 తేదీ నాడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు రామాపురం మండలం టిడిపి అధ్యక్షులు, గాలివీటి సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతతో అమలవుతున్నదని లబ్ధిదారులకు పెన్షన్లు సమయానికి అందేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రామాపురం మండల పరిధిలో పార్టీ బాధ్యులు, క్లస్టర్/యూనిట్ ఇంచార్జ్‌లు, గ్రామ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు మరియు అభిమానులు అందరూ తమ తమ పరిధిలో జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొని, లబ్ధిదారులకు సహకరించి అండగా నిలవాలని కోరారు.అలాగే పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా మంచి డిపి యాప్ నందు నందు అప్లోడ్ చేయాలని సూచించారు.

## రైతులకు వేరుశెనగ సబ్సిడీ విత్తనాలు పంపిణీ

**మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండీ షఫినాయక్**



**లక్కిరెడ్డిపల్లి జూన్ 30 ప్రజా జ్యోతి** లక్కిరెడ్డిపల్లి మండలం దప్పేపల్లి గ్రామం లో రైతు వినియోగ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ఎండీ షఫినాయక్ మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ పేర్కొన్నారు మంగళవారం దప్పేపల్లి పంచాయతీలోనీ పల్లెలో రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1900 క్వింటాళ్లు వేరుశెనగ విత్తన కాయలు మండలాలకు వచ్చాయని ప్రతి రైతు ఉపయోగించుకోవాలన్నారు మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలకు నీరు అందించడం వలన ప్రతి బోరుబావిలో నీరు పుష్కలంగా ఉన్నాయని రైతులు పంటలు సాగు చేసుకోవచ్చన్నారు ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సింగల్ బి అధ్యక్షుడు లక్ష్మి రాజు కావాలి ఆంజనేయులు,పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

**--30 కేసులు నమోదు,9 మందికి జైలు శిక్ష,**
**--రూ.2.10 లక్షల జరిమానా**



**కాకినాడ జిల్లా జూన్ 30 (ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కాకినాడ పట్టణంలో ట్రాఫిక్ 1 మరియు 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 30 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు.ఇందులో ట్రాఫిక్ 1 పిఎస్ పరిధిలో 08 కేసులు, ట్రాఫిక్-2 పిఎస్ పరిధిలో 22 కేసులు నమోదు అయ్యాయి. తరువాత 3వ స్పెషల్ జ్యుడీషియల్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్,కాకినాడలో విచారణ జరగగా,మేజిస్ట్రేట్ చింతా నాగేంద్రరావు శిక్షలు విధించారు.మొత్తం కేసుల్లో 9 మందికి జైలు శిక్ష విధించగా,అందులో ఒకరికి 5 రోజులు,ముగ్గురికి 3 రోజులు చొప్పున, మరో ముగ్గురికి 2 రోజులు చొప్పున,ఇద్దరికి 1 రోజు చొప్పున శిక్ష విధించారు.మిగిలిన 21 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.2,10,000 జరిమానా విధించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ 1 సిఐ ఎన్ రమేష్ హెచ్చరించారు.

# కేబినెట్ ఫైట్... శాఖల మార్పులు తప్పవా



తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు పదవీ గండం తొలగిపోయినట్టేనని జాతీయ మీడియా సహా.. బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నెలలోనే అంటే.. కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన రాగానే అదే రోజు లేదా ఈ నెల 30 నాటికి మంత్రి వర్గ మార్పు ఉంటుందని జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోంది.ఇటీవలే ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి వర్గ ప్రక్షాళనపైనే ఆమెతో చర్చించినట్టు కూడా వార్తలు రాగా.. తాజాగా మరో విషయం వెలుగు చూసింది. మంత్రుల కూర్పుపై పలు పేర్లతో కూడిన జాబితాను కూడా రాష్ట్రపతికి ప్రధాని అందించారని జాతీయ మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ చోటు ఏమాత్రం చెదిరిపోదన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బండి భగీరథ్ వ్యవహారం తెరమీదికి వచ్చిన తర్వాత.. కేంద్ర మంత్రిగా సంజయ్‌ను తప్పిస్తారన్న చర్చ సాగింది.కానీ, ఈ విషయంలో బండి ప్రమేయం లేదని.. ఆయన పార్టీకి చేసిన సేవల నేపథ్యంలోనే పదవి లభించిందన్న వాదన ఉంది. పైగా.. పార్టీకి కుటుంబ వ్యవహారాలకు కూడా సంబంధం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ సీటు విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మొత్తం ఐదుగురు మంత్రులు ఉండగా.. బండి సంజయ్‌ను అలానే కొనసాగించినా.. మిగిలిన నలుగురి విషయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడును పర్యాటక శాఖ మంత్రిగా(ఇండిపెండెంట్ )గా పంపించే అవకాశం ఉందని గట్టిగా చెబుతున్నారు.ఇక, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం కిషన్ రెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అలానే.. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విషయంలోనూ మార్పు ఉండే అవకాశం ఉందని.. ఆయనను కూడాహోం శాఖ పరిధిలోకి తీసుకుంటారని అంటున్నారు. ఇక, బీజేపీ నాయకుడు, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ.. ప్రస్తుతం కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనను కూడా మార్పు చేసి.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ మార్పులు చేర్పులు ఉండడం మినహా మంత్రులను తప్పించే అవకాశం లేదని సమాచారం.

నిర్మలమ్మ స్థానంలో శక్తికాంత్ దాస్

కేంద్ర మంత్రివర్గంలో ప్రక్షాళన ఖాయమనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కీలకమైన ఆర్థిక శాఖ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 10 సంవత్సరాలుగా ఈ శాఖకు మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను తప్పించడం ఖాయమని ఢిల్లీ వర్గాలు సహా.. బీజేపీ పెద్దలు కూడా చూచాయగా చెబుతున్నారు. అంతేకాదు.. ఆమె స్థానంలో ఆర్ బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో శక్తికాంత దాస్.. చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇది ఇప్పుడు ఆయనకు కలిసి వస్తుందని అంటున్నారు.గత 10 సంవత్సరాలకు పైగానే కేంద్ర ఆర్థిక మంత్రిగా అపర చాణిక్యురాలిగా పేరొందిన నిర్మలా సీతారామన్‌ను మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని జాతీయ మీడియా పేర్కొంది. గత రెండేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు.. ఆర్థిక కార్యకలాపాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న దరిమిలా.. త్వరలోనే జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వ్యవహారం కూడా దీనికి లింకుగా ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహాన్ని తగ్గించేందుకు.. దేశంలో ఆర్థిక సమస్యలు తగ్గించి.. కార్యకలాపాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంటోంది.డాలర్‌తో పోలిస్తే.. గత రెండేళ్లుగా రూపాయి మారకం విలువ పడిపోతోంది. అదేసమయంలో స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు.. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించడం.. మరోవైపు పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు వంటి వాటిని సమర్థవంతంగా నిర్మలమ్మ ఎదుర్కొనలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను తప్పించడం ఖాయమని చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించకుండా.. శాఖను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉందని పెద్ద ఎత్తున బీజేపీ నాయకుల మధ్య కూడా చర్చ సాగుతోంది.ఇక, శక్తికాంత దాస్ విషయానికి వస్తే.. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన కరోనా వంటి కీలక సమయంలోనూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక స్థితి మందగమనంలో ఉన్నప్పుడు కూడా భారత్ తనను తాను నిలబెట్టుకు నేలా ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఆర్థిక రిజర్వ్‌లు తగ్గిపోకుండా చూశారు. ఇవన్నీ భవిష్యత్తులో దేశాన్ని మరోసారి నిలబెట్టే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. కాగా.. ప్రస్తుతం శక్తికాంతదాస్ పార్లమెంటుకు ఏ సభ నుంచి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ.. ఆయనను మంత్రిగా తీసుకుని.. తర్వాత రాజ్యసభకు ప్రమోట్ చేయించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పోలవరం ముంపు.. తెలంగాణకు ముప్పు



ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భారీ వర్షాలు, వరదల వల్ల తెలంగాణ భూభాగంలోని భద్రాచలం పరిసరాల్లోని గోదావరి తీర ప్రాంతంలో పెను విధ్వంసం జరుగనున్నది. ఈ వాస్తవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం గ్రహించాలి. దిగువన డ్యామ్ నిర్మాణంతో కాఫర్ డ్యామ్, స్పిల్ వే వల్ల బ్యాక్ వాటర్ (నదిలో స్థిరంగా ఉండే నీళ్లు) చుట్టుముడుతాయి. ముంపు మండలాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారే ప్రమాదం ఉన్నది. వరదలు వస్తే 30 రోజుల పాటు జనావాసాలు జలమయమై తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, చేయడానికి పనిలేక ప్రజలు ఇబ్బందులు పడుతారు. అటువంటి కీలకమైన ముంపు సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ప్రజల శ్రేయస్సు, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు నివారణ చర్యలు చేపట్టకపోగా నిమ్మకు నీరెత్తినట్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. గతంలో అనేకసార్లు తెలంగాణ ఆత్మగల దార్శనికుడు కేసీఆర్ సమర్థ నాయకత్వంలో క్యాబినెట్ మంత్రిగా పోలవరం ముంపు సమస్యపై పెద్దఎత్తున తెలంగాణ పక్షాన వాదించాను. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి ముంపు నుంచి తెలంగాణవాసులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు అంటున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా ప్రజల ప్రయోజనాల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ సోయి లేకుండా వ్యవహరిస్తున్నది.

2022లో భద్రాచలం వద్ద 71.3 అడుగుల ఎత్తులో వచ్చిన వరద 22 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంగా నమోదైంది. పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72 మీటర్లు కాగా భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా 45.72 మీటర్లు. అంటే పోలవరం నిండితే భద్రాచలం ఎప్పుడూ ముంపు ప్రమాదంలోనే ఉంటుందని భావించాలి. భద్రాచలం వద్ద గోదావరి నది లోతైన బెడ్ లెవల్ 26 మీటర్లు బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిల్వ ఉంటుంది. ఇది నిత్యం తీవ్రమైన సమస్యగా మారుతున్నది. 900 ఎకరాల్లో నష్ట ప్రభావం కూడా ఉంటుంది. 2021లో పోలవరం కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత 2022లో వచ్చిన వరదల్లో బ్యాక్‌వాటర్ కారణంగా భద్రాచలంతో పాటు పరిసరాలు విలవిల్లాడాయి 40 శాతం భద్రాచలం పట్టణం జలమయమై, బాధితులు దీనావస్థలో రోడ్డున పడ్డారు. వరద బాధితులను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆదుకున్నది.

అప్పట్లో 22 లక్షల క్యూసెక్కుల వరదకే ఇంత నష్టం జరిగితే..ప్రాజెక్టు డిజైన్ ప్రకారం భవిష్యత్తులో 36 లక్షల నుంచి 50 లక్షల సెక్యూల వరద వస్తే ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టంతో పూర్తిగా మునిగిపోయే ప్రమాదం పొంచిఉన్నది. పలు అధ్యయనాల ప్రకారం 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతుందని తెలుస్తున్నది. కేవలం గ్రామాలే కాకుండా ఈ ప్రాంతంలోని భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్‌వాటర్ ముప్పు పొంచి ఉన్నది. దాదాపు ఐదువేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్‌బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్తు ప్రాజెక్టులకు ఈ బ్యాక్‌వాటర్ వల్ల తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుంది. దక్షిణాది అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రికి ఘనమైన ప్రాశస్త్యం ఉన్నది. అలాంటి రామాలయానికి కూడా పోలవరం ముంపు ముప్పు తప్పదు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పోలవరం ప్రాజెక్టు ద్వారా సంభవించే ముంపు ముప్పును నివారించేందుకు చర్యలు చేపట్టాలి. పునరావాస ప్యాకేజీ అమలు చేయాలి.

గోదావరి వరద తట్టుకునేందుకు కరకట్టలు కట్టాలి. ఇప్పటికే ఉన్న వాటి కరకట్టల ఎత్తును పెంచాలి. వర్షాకాలంలో స్లూయిస్‌ల దగ్గర వరద నీరు ప్రవహించదు కనుక ఆ సమయంలో మోటర్ల ద్వారా నీటిని తోడేయాలి. లోతట్టు ప్రాంత ప్రజలను మెరక ప్రాంతానికి తరలించి కాలనీలు నిర్మించాలి. ఎక్కువగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రహదారులపై ప్రవహించే వాగుల మీద చప్టాలు నిర్మించాలి. వంతెనలు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట రోడ్ల ఎత్తు పెంచాలి. తక్షణ చర్యలతో పాటు మౌలిక సదుపాయాల రక్షణ, ప్రజల భద్రత, పర్యావరణ, సాంకేతిక చర్యలు, పరిశ్రమలు, వారసత్వ ప్రాంతాల రక్షణ, విధానపరమైన చర్యలు వంటి పలు కీలక అంశాలపై దృష్టి సారించాలి. తెలంగాణ ప్రజల రక్షణకు, వారి శ్రేయస్సు కోసం పాటుపడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉన్నది. ముంపు నుంచి తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఆర్ఎస్ తరఫున, ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. మానవజాతిని కాపాడటం, భవిష్యత్‌తరాలకు మనం ఇచ్చే భద్రత. అదే అందరికీ శ్రీరామరక్ష.

## జహంగీర్ యువసేన ఆధ్వర్యంలో నేడు ఘనంగా సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 30 (ప్రజా జ్యోతి)** జహంగీర్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ భాష తెలిపారు. ఈ సందర్భంగా జహంగీర్ భాష మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కావున బద్వేల్ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,సూర్యనారాయణ రెడ్డి అభిమానులు అందరూ ఎన్జీవో కాలనీలోని సూర్యనారాయణ రెడ్డి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సతీసమేతంగా దర్శించుకున్న

### మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి




**రామాపురం జూన్ 30 ప్రజా జ్యోతి** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనము అనంతరం మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వారి దివ్య ఆశీస్సులు, కరుణాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై నిత్యం నిండుగా వర్షాలు కురవాలని, అందరూ, ఆరోగ్యాలు సుఖశాంతులు, సిరిసంపదలు ప్రసాదించాలని ప్రార్థించాను.

# వ్యవసాయ సంక్షోభం తప్పదా

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం.గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది.దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్-రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది.ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు

# మళ్లీ పాత రూట్లోకి అల్లరి నరేష్..

**పుట్టినరోజు కానుకగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ రిలీజ్!**



టాలీవుడ్ సీనియర్ హీరో, కామెడీ కింగ్ అల్లరి నరేష్ నేడు తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సీరియస్ ఎమోషనల్ కథలతో అలరించిన నరేష్, చాలా విరామం తర్వాత మళ్లీ తన మార్క్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి "కామెడీ గోస్ కాస్మిక్" అనే ఒక క్రేజీ ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు, ఇది సినిమాలోని వినోద స్థాయి ఏ రేంజ్‌లో ఉండబోతోందో ముందే హింట్ ఇస్తోంది. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఈ సారి నమ్మండి.. నేను మాట్లాడను

టాలీవుడ్ అక్కినేని అఖిల్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైజాగ్ వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన అఖిల్ ఈ మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. నా సినిమా వచ్చి ఇప్పటికీ మూడేళ్లయిందని.. సారీ బ్రదర్.. ఈ విషయంలో నన్ను క్షమించాలంటూ అభిమానులను కోరారు అఖిల్. నా గుండెలపై చేయి వేసుకుని చెబుతున్నా.. ఈ సారి నేను మాట్లాడను.. కేవలం నా సినిమానే మాట్లాడుతుందన్నారు. ఇంతకుమించి నేనేం చెప్పకూడదు.. రెండు రోజులుగా నేను నిద్రపోలేదు.. కళ్లద్దాలు పెట్టుకుని వద్దామనుకున్నానని తెలిపారు. మిమల్ని చూస్తుంటే జూలై 10 వరకు పనిచేసే ఎనర్జీ వచ్చిందని అభిమానులను ఉద్దేశించి అఖిల్ మాట్లాడారు.






# రావు బహదూర్ మూవీ.. ట్రైలర్ రిలీజ్

సత్యదేవ్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ రావు బహదూర్. ఈ చిత్రానికి వెంకటేష్ మహా దర్శకత్వం వహంచారు. ఈ మూవీలో దీపా థామస్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. గతంలో ఆయన డైరెక్ట్ చేసిన 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలు టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ చిత్రాన్ని మహేశ్ బాబు, నమ్రతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ మహేశ్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఈ ట్రైలర్ ట్రైలర్ చూస్తుంటే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మునుపెన్నడు చూడని తెలుగు సినిమా రావు బహదూర్ అంటూ ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు మహేశ్ బాబు. కాగా.. ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, కునాల్ కౌశిక్, మాస్టర్ కిరణ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు స్మరణ్ సాయి సంగీతమందించారు.

# సుడిగాలి సుధీర్ సినిమా.. 'లైలం బాబు'గా శివాజీ



సుడిగాలి సుధీర్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. శివాజీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. 'లైలం బాబు' పాత్రలో శివాజీ తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ తో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.



# పొలిటికల్ ఎంట్రీపై రాఘవ లారెన్స్ యూటర్న్.. అభిమానులకు భారీ షాక్!

నటుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొద్దిరోజులుగా కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని పూర్తిగా తన అభిమానులకే వదిలేస్తున్నట్లు లారెన్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పోటీ చేసి తప్పుకున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) నియోజకవర్గం నుంచి లారెన్స్ బరిలోకి దిగబోతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా రూమర్స్ చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తూ, తన రాజకీయ భవిష్యత్తుపై లారెన్స్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియా వేదికగా దాదాపు 16 నిమిషాల నిడివి గల ఒక సుదీర్ఘమైన వీడియోను పోస్ట్ చేసిన లారెన్స్, తన పొలిటికల్ ఎంట్రీపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని, తాను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే అంతటితో ఆగకుండా, తాను ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన రాజకీయాల్లోకి రానని అనుకోవద్దని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ కేవలం సినిమాలపైనే ఉందని, ఒప్పుకున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యతని వివరించారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల్లో నిలబడకపోయినా, తన ట్రస్ట్ ద్వారా సమాజానికి చేసే సేవలు మరియు సహాయ కార్యక్రమాలు ఎప్పటిలాగే నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ కాంచన హీరో వెల్లడించారు.